ఈనాడు
సూర్యాపేట
సోమవారం అక్టోబరు 21, 2024 5

రైతు భరోసా ఇవ్వకపోవడం దారుణం: బడుగుల



సూర్యాపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న భారాస నాయకులు



తిరుమలగిరి: తెలంగాణ చౌరస్తాలో ..

సూర్యాపేట (తాళ్లగడ్డ), న్యూస్‌టుడే: వానాకాలం పంటకు సైతం రైతు భరోసా ఇవ్వమని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కుంటి సాకులు చెప్పడం దారుణమని భారాస జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ ఆరోపించారు. ఈ మేరకు సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మహాధర్నాలో భాగంగా దిష్టిబొమ్మ దహనం చేసి మాట్లాడారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేస్తోందని ధ్వజమెత్తారు. నాయకులు నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, జీడి భిక్షం, తాహెర్‌పాష, మడిపల్లి విక్రం, గండూరి కృపాకర్, ఈదుల యాదగిరి, సల్మా, కరుణశ్రీ పాల్గొన్నారు.

నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సూర్యాపేట ఇందిరమ్మ కాలనీలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం పోలీసు ఫ్లాగ్‌డే కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆదివారం తెలిపారు. పోలీసు అమర వీరుల స్తూపం వద్ద అమరులకు ఘన నివాళులు అర్పించనున్నట్లు తెలిపారు. అమరులను స్మరిస్తూ కొవ్వొత్తులు, సైకిల్ ర్యాలీలు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామని, పోలీసు ఓపెన్ హౌస్ ద్వారా పోలీసు విధుల గురించి వివరిస్తామన్నారు. పది రోజులపాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమాల్లో ప్రజలు, విద్యార్థులు పాల్గొనాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

చిన్నారిని చేయొద్దు.. పెళ్లికూతురు..!

రెండేళ్ల క్రితం కొండమల్లేపల్లి మండలంలో బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులపై తల్లిదండ్రులు తిరగబడ్డారు.

ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా ఉన్న తండాలు, మారుమూల గ్రామాల్లో నిరక్షరాస్యత, ఆర్థిక ఇబ్బందులు, అవగాహన లేమి, మూఢ నమ్మకాలతో పదో తరగతి, ఇంటర్ పూర్తి కాగానే బాల్య వివాహాలు చేస్తున్నారు. నల్గొండ జిల్లాలోని డిండి, చందంపేట మండలాల్లో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు.



మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

ప్రభుత్వాలు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా.. సమాజంలో బాల్య వివాహాలకు అడ్డుకట్ట పడడం లేదు. మారుమూల గ్రామాలు సైతం సాంకేతిక పరిజ్ఞానంతో దూసుకుపోతున్న నేటి తరుణంలో సైతం నిత్యం బాల్య వివాహాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏటా వందకు పైగానే బాల్య వివాహాలను అధికారులు అడ్డుకుంటున్నప్పటికీ.. గుట్టు చప్పుడు కాకుండా జరిగేవి మరెన్నో ఉంటున్నాయి.



మిర్యాలగూడ: ఆలగడప జడ్పీ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో మమత(పాత చిత్రం)

సుప్రీంకోర్టు మార్గదర్శకాలు..



బాల్య వివాహాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన దేశ అత్యున్నత న్యాయస్థానం 141 పేజీల తీర్పులో పలు మార్గదర్శకాలు జారీ చేసింది. చిన్నారుల జీవన, విద్య, ఆశలు, ఆరోగ్యం, హక్కులను చిదిమేసే బాల్య వివాహాలను నిర్మూలించేందుకు బాహుముఖ కార్యాచరణ చేపట్టాలని సూచించింది. బాల్య వివాహాల నిర్మూలనకు జిల్లాకో ప్రత్యేక అధికారిని నియమించడంతో పాటు.. ఈ కార్యక్రమంలో కలెక్టర్లు, ఎస్పీలను భాగస్వాములను చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

అందుబాటులో టోల్ ఫ్రీ నంబర్..



బాల్య వివాహాల నిర్మూలన, బాలల సంరక్షణ కోసం 1098 టోల్ ఫ్రీ నంబరు అందుబాటులో ఉంది. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం అందిస్తే సంబంధిత అధికారులు ఆ వివాహాన్ని అడ్డుకుని.. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు 18 ఏళ్లు నిండే వరకు బాలికకు వివాహం చేయబోమని ఒప్పంద పత్రం రాయించుకుంటారు.

అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం..

– కృష్ణవేణి, జిల్లా సంక్షేమాధికారిణి, నల్గొండ



బాల్య వివాహాల నిర్మూలనకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. గ్రామ స్థాయిలోని విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీల ఆధ్వర్యంలో నిరంతర పర్యవేక్షణ చేస్తున్నాం. బాలికలను విద్యాసంస్థల్లో చేర్పడం, జిల్లా కేంద్రంలోని బాల సదన్‌కు పంపడం వంటి చర్యలు చేపడతాం.

ఉమ్మడి జిల్లాలో 2020 నుంచి అడ్డుకున్న బాల్య వివాహాల వివరాలు.. (2024 అక్టోబరు వరకు)

జిల్లా	2020	2021	2022	2023	2024
నల్గొండ	50	42	41	43	17
సూర్యాపేట	72	55	72	35	43
యాదాద్రి	26	22	14	21	12

అనారోగ్య సమస్యలు: – డాక్టర్ జీవనజ్యోతి, మిర్యాలగూడ



బాల్య వివాహాల వల్ల బాలికలకు హార్మోన్ల అసమతౌల్యతతో పాటు శారీరక, మానసిక సమస్యలు ఏర్పడతాయి. సరైన అవగాహన లేకుండా గర్భం దాల్చడం వల్ల రక్తహీనత, రక్తపోటు వంటి సమస్యలతో పాటు మానసిక పరిపక్వత లేకపోవడంతో భార్యభర్తల మధ్య తరచూ వివాదాలు చోటుచేసుకునే ప్రమాదం సైతం ఉంది.

తప్పుడు తూకాలతో టోకరా!

◆ పల్లెల్లో దళారులు, దడువాయిల దందా ◆ మోసపోతున్న పత్తి రైతులు

ఇటీవల చివ్వెంల మండలానికి చెందిన ఓ వ్యక్తి, మరో దళారి కలిసి మూసీ ప్రాంతంలోని ఇటుకపహాడ్‌లో పత్తిని కొనుగోలు చేస్తుండగా తూకంలో తేడాలు రావడంతో రైతులు గొడవకు దిగారు.

ఆత్మకూర్(ఎస్) మండలానికి చెందిన ఓ పత్తి వ్యాపారి చివ్వెంల మండలం గుంజలూరులో ముగ్గురు రైతుల వద్ద పత్తి కొనుగోలు చేశారు. ఒకసారి 74 కిలోలు తూకం వచ్చిన పత్తి బస్తాను అనుమానంతో రెండోసారి తూకం వేస్తే 81కిలోలకు పెరిగింది. ఏడు కిలోలు తేడా రావడంతో రైతులు ఆగ్రహించారు. కాంటాలను నిలిపేశారు.

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే:

ఒక్క రోజులో వంద క్వింటాళ్ల పత్తి కాంటా వేస్తే అందులో తప్పుడు తూకం ద్వారా 10 నుంచి 15 క్వింటాళ్ల వరకు కొన్నవారికి మిగలాలి.' ఇదీ పల్లెల్లో పత్తి కొనుగోలుకు దళారులు అనుసరిస్తున్న విధానం. ఈ మోసంలో తూకం వేసిన దడువాయి రోజూ రూ.5 వేల నుంచి 10 వేల వరకు దక్కితే, లక్షల రూపాయలు దళారుల జేబుల్లోకి వెళ్తున్నాయి. రోజూ ఇదే దందా.. ఇదే మోసం. పర్యవేక్షణ చేపట్టి అడ్డుకునే వారు లేరు. గ్రామాల్లో పత్తి కొంటామంటూ వచ్చే వ్యాపారులు ఆరుగాలం కష్టించి పంట పండించిన రైతులు నిలువునా ముంచుతున్నారు.



ఆత్మకూర్(ఎస్)లో తప్పుడు తూకాల వ్యవహారంపై ఆదివారం దళారులను నిలదీస్తున్న రైతులు

క్వింటాకు పది కిలోల తరుగు

ఏళ్లకొద్దీ ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో తప్పుడు కాంటాలతో పత్తి వ్యాపారం మోసం చేస్తూ తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు, ఆరుకాయలుగా విస్తరించుకుంటున్నారు. ముఖ్యంగా తూకంలో మోసం చేసి క్వింటాకు పది కిలోల వరకు రైతుకు తక్కువగా చూపిస్తున్నారు. దళారుల మోసాల కారణంగా రైతులు అప్పులపాలవుతున్నారు. ముఖ్యంగా సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఈ రెండేళ్లుగా పత్తి వ్యాపారంలో దళారులు నిలువు దోపిడీకి పాల్పడుతున్నారు. తమకు నమ్మకమైన దడవాయిలను పెట్టుకొని గ్రామగ్రామాన బేరం చేస్తూ కొండి కాంటాలను ఉపయోగిస్తూ కర్షకులను నట్టేట ముంచుతున్నారు. కొండి కాంటాల వల్ల క్వింటాకు ఐదు నుంచి పది కిలోల వరకు రైతుకు తక్కువ తూకం చూపిస్తారు.

వ్యాపారులతో వాగ్వాదం

ఆత్మకూర్(ఎస్) మండలకేంద్రంలో ఆదివారం రెండు వర్గాలుగా మారిన పత్తి దళారులు గ్రామ పంచాయతీలో గొడవ పడ్డారు. గమనించిన స్థానిక రైతులు వారికి ఎదురు తిరిగి కాంటాలలో చేస్తున్న మోసాలపై నిలదీశారు. ఏటా పత్తి దళారుల చేతుల్లో పడి వేలాది మంది రైతులు రూ.లక్షల్లో నష్టపోతున్నారు. తూకంలో మోసాలపై తూనికలు, కొలతల శాఖాధికారులను 'న్యూస్‌టుడే' ఫోన్ ద్వారా సంప్రదించే ప్రయత్నం చేయగా అందుబాటులో లేరు.

ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

కుడకుడరోడ్డు(సూర్యాపేట), న్యూస్‌టుడే: గీత కార్మికుల పక్షాన పోరాటం చేసింది మాజీ ఎంపీ ధర్మభిక్షం అని.. ఐక్య పోరాటాలతోనే కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయని గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ధర్మబిక్షం భవన్‌లో ఆదివారం గీత పనివారల సంఘం 67వ వార్షికోత్సవ సభకు ముఖ్య అతిథిగా హాజరై జెండాను ఎగర వేశారు. ఆయన మాట్లాడుతూ.. ధర్మభిక్షం పోరాట స్ఫూరితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలన్నారు. తొలుత ధర్మబిక్షం చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, బొమ్మగాని శ్రీనివాస్, ధూళిపాల ధనుంజయ నాయుడు, తొట్ల ప్రభాకర్, తోగిరి మురళి, అనంతుల జానయ్య, బొడ్డు రామచంద్రయ్య, పాల్గొన్నారు.



సూర్యాపేటలోని గీతపనివారల సంఘం జెండాను ఎగరవేస్తున్న బొమ్మగాని ప్రభాకర్

ఆ ఆపరేటర్ అక్రమాలకు చింతలపాలెంలోనే బీజం!

మేళ్లచెరువు, చింతలపాలెం, న్యూస్‌టుడే: హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని కొన్ని రెవెన్యూ కార్యాలయాలు అక్రమాలకు అడ్డాగా మారాయి. హుజూర్‌నగర్ తహసీల్ కార్యాలయంలో తాజాగా బహిర్గతమైన వ్యవహారమే ఇందుకు నిదర్శనం. ప్రభుత్వ భూమి ఇతరుల పేరిట మార్పిడి చేసిన ఘటనలో ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన జయశ్రీ, ధరణి ఆపరేటర్ జగదీశ్‌లపై కేసులు నమోదై రిమాండ్‌లో ఉన్నారు. జగదీశ్ అంతకుముందే దాదాపు రెండేళ్లపాటు చింతలపాలెం తహసీల్ కార్యాలయ ధరణి ఆపరేటర్‌గా పనిచేశారు. అక్కడి నుంచి హుజూర్‌నగర్‌కు రిలీవ్ అవడానికి ఒకరోజు ముందే ఒకరి పేరుతో ఉన్న అసైన్డ్ భూమి.. వారు బతికుండగానే మరొకరి పేరిట మారిపోయింది. చింతలపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే సంఖ్య 372లో 2.20 ఎకరాలు, 375లో ఎకరం భూమిని పట్టాదారులు ఉండగానే మరొకరి పేరుతో మారడాన్ని అధికారులు పసిగట్టారు. అప్పుడు బాధితులు తహసీల్దారు సురేందర్‌రెడ్డిని సంప్రదించే వరకు విషయం బయటకు పొక్కక పోవడం గమనార్హం.

ఉద్యోగుల్లో వణుకు.. అప్పటికప్పుడు దస్త్రాలను సవరించేందుకు వీల్లేని పరిస్థితుల్లో ఇక్కడి తహసీల్దారు జరిగిన అక్రమాన్ని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ దృష్టికి తీసుకెళ్లారు. అదే సమయంలో హుజూర్‌నగర్ మండలంలోనూ 36 ఎకరాలు ఇలాగే జరిగిన విషయం కలెక్టర్‌కు తెలిసింది. ఈ తప్పులను తీవ్రంగా పరిగణించిన కలెక్టర్ హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులును విచారణకు ఆదేశించారు. ఆ తర్వాత తహసీల్దారు జయశ్రీ, ఆపరేటర్ జగదీశ్‌లను రిమాండ్‌కు తరలించారు. వీరి అరెస్టుతో నియోజకవర్గంలోని అన్ని తహసీల్ కార్యాలయాల ప్రభుత్వ ఉద్యోగులు అప్రమత్తమవ్వగా, చింతలపాలెం, మేళ్లచెరువు మండలాల్లో కొందరు రెవెన్యూ ఉద్యోగుల్లో వణుకు పుడుతోంది.

★ ఆ మధ్య మేళ్లచెరువు మండలంలోని కందిబండలోనూ పట్టాదారులకు తెలియకుండానే ఇతరుల పేరుతో రిజిస్ట్రేషన్ జరిగిన వ్యవహారం బయటకు పొక్కింది. ఇప్పటివరకు అది కలెక్టరు దృష్టికి వెళ్లకుండా జాగ్రత్త పడినట్టు తెలుస్తోంది.

★ ఇటీవలే మేళ్లచెరువులోనూ ఇద్దరు వృద్ధ దంపతులను మభ్యపెట్టి ఒకరి పేరుతో ఉన్న మొత్తం భూమి, మరొకరి పేరుతో ఉన్న సగం భూమిని మరొకరికి రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారం తాజాగా చర్చనీయాంశమైంది. ఈ అన్యాయంపై వారు రాణా మెట్లెక్కినా ఇంతవరకు చర్యలు శూన్యం.

★ జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అన్ని గ్రామాల్లో ప్రభుత్వ అసైన్డ్ భూములు, వాటి తాజా పరిస్థితుల గురించి నివేదికలు రూపొందిస్తున్నారు. ప్రభుత్వ ప్రైవేటు భూమి పట్టాల మార్పిడిలో అక్రమాలకు బీజం పడిన చింతలపాలెం, మేళ్లచెరువు మండలాల్లో రూ.లక్షల్లో దిగమింగి, కొన్ని అక్రమాలను తమ కనుసన్నల్లో నడిపించిన రెవెన్యూ ఉద్యోగులకు భయం పట్టుకుంది.

పరికరాల కొరత.. సాగని విద్యుదీకరణ

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే:

పెరుగుతున్న విద్యుత్తు సర్వీసులకు అనుగుణంగా చేపడుతున్న విద్యుదీకరణ పనులకు బ్రేకులు పడుతున్నాయి. సంస్థలో పరికరాల కొరత వేధిస్తోంది. వానాకాలం పంటల నూర్పిడి పూర్తి కానుండటంతో నిలిచిన, కొత్తగా చేపట్టాల్సిన పనులు ప్రారంభించేందుకు గుత్తేదారులు ముందుకు వస్తున్నా.. విద్యుదీకరణ పనులకు కావాల్సిన ప్రధాన పరికరాలు అందుబాటులో లేకపోవడంతో పనులు నిలిచిపోతున్నాయి. దీంతో రైతులు, వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



దిమ్మె నిర్మించినా ఏర్పాటు చేయని విద్యుత్తు నియంత్రిక

మరమ్మతులతో సరఫరాకు అంతరాయం

రైతులు విద్యుత్తు నియంత్రికల కోసం డీడీలు చెల్లించినా.. మంజూరైన స్తంభాలు, తీగ, ఏబీ స్విచ్‌లు, హెడ్జ్ ఫ్యూజుల కాసారాలు, క్లాంపులు వంటి సామగ్రి నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం అధికారులు అందించలేకపోతున్నారు. నియంత్రికల వద్ద కరెంటు సరఫరాను నియంత్రించడంలో కీలకమైన ఏబీ స్విచ్‌ల కొరత ఎప్పటి నుంచో వేధిస్తోంది. ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే విద్యుత్తు ఉపకేంద్రాల్లో కరెంటు సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఒక చోట కాకుండా దాని పరిధిలోని గ్రామాల్లో సరఫరాలో అంతరాయం చోటు చేసుకుంటోంది.

మంత్రి కోమటిరెడ్డి చొరవతో..

ఉమ్మడి నల్గొండ జిల్లాలో నల్గొండ, యాదాద్రి భువనగిరి సర్కిళ్ల పరిధిలో సుమారు 1050కి పైగా విద్యుత్తు నియంత్రికలు, 1125కిపైగా ఏబీ స్విచ్‌ల కొరత నెలకొంది. ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా విద్యుత్తు శాఖలపై సమీక్ష నిర్వహించారు. పరికరాల కొరతను అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన విద్యుత్తు శాఖ మంత్రి భట్టి విక్రమార్కతో పాటు సీఎండీతో చర్చించినట్లు తెలిసింది. మంత్రి కోమటిరెడ్డి చొరవతో 250 వరకు నియంత్రికలు అందజేస్తామని హామీ ఇచ్చారని సమాచారం. ఈ మేరకు ఇటీవల వంద ట్రాన్స్‌ఫార్మర్లు నల్గొండ జిల్లాకు చేరినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇంకా 900లకు పైగా విద్యుత్తు నియంత్రికలు తక్షణం అవసరం ఉంది.

రైతుల నిరీక్షణ..!

రాష్ట్ర ప్రభుత్వం రెండు జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న సుమారు 10 వేలకు పైగా ఉచిత వ్యవసాయ బోరుబావుల సర్వీసులను ఇటీవల విడుదల చేసింది. వాటికి కరెంటు సరఫరా చేసేందుకు అవసరమైన విద్యుదీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. చాలా ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు రైతులు సొంత ఖర్చులతో దిమ్మెలు నిర్మించుకుని పరికరాల కోసం ఎదురు చూస్తున్నారు. లోవోల్టేజీ ఉన్న ప్రాంతాల్లో టీఎస్డీ స్కీం ద్వారా నియంత్రికల సామర్థ్యం పెంచాల్సి ఉంది. అన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ నియంత్రికల కొరతతో పనుల్లో జాప్యం నెలకొంటుంది. దేవరకొండ, నల్గొండ, ఆలేరు, మునుగోడు నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున పనులు చేపట్టాల్సి ఉండగా.. పరికరాల కొరతతో అవాంతరాలు ఎదురయ్యే అవకాశం ఉంది.

అవసరం ఉంటే తెప్పిస్తాం

వెంకటేశ్వర్లు, ఎస్ఈ, విద్యుత్తు సంస్థ నల్గొండ సర్కిల్

కొత్తగా బాధ్యతలు స్వీకరించాను. పూర్తి వివరాలు తెలుసుకుంటాం. విద్యుత్తు పరికరాల నిల్వలపై, కొరతపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తా. నియంత్రికలు, ఏబీస్విచ్‌లు అవసరం ఉంటే ప్రతిపాదనలు పంపిస్తాం. ఉన్నతాధికారులతో చర్చించి తెప్పించేందుకు చర్యలు తీసుకుంటాం.

పత్రిక ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకంనకు నా క్లయింటు అయిన శ్రీ పాలెం శ్రీనివాసులు, తండ్రి: దర్గయ్య, వృత్తి: వ్యాపారము, నివాసము: సూర్యాపేట పట్టణము, సూర్యాపేట జిల్లా.

షెడ్యూలు దాఖల ఆస్తి ఇంటి నెం.1-7-207/2/11/1/5/B, సర్వే నెంబర్: 329లో గల విస్తీర్ణమును ఖరీదు చేసి విక్రయ ధనములో నుండి కొంత భాగము చెల్లించి అగ్రిమెంట్ వ్రాయించుకున్నారు. మరియు నా క్లయింటు మిగిలిన విక్రయ ధనంను చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకొని, స్వాధీనం చేసుకొనుటకు సిద్ధంగాయున్నారు. కావున షెడ్యూలు దాఖల ఆస్తిపై ఎవరికైనా అభ్యంతరములు, క్లెయిమ్‌లు, చార్జ్‌లు వున్నచో 10 రోజులలో దస్తావేజు మరియు ఆధారములతో యుక్తంగా వచ్చి తెలియజేయగలరు. గడువు తీరిన తదుపరి నా క్లయింటు షెడ్యూలు దాఖల ఆస్తిని విక్రయధనం చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకొని, స్వాధీనం చేసుకోగలరు. తదుపరి ఎవరైనా అభ్యంతరాలు పెట్టినచో అవి నా క్లయింటుపై చెల్లుబాటు కావు.

షెడ్యూలు ఆస్తి వివరములు:

సూర్యాపేట జిల్లా, సూర్యాపేట పట్టణ కాపురస్తులు మహ్మద్ యాసిన్, తండ్రి: హనీఫ్ గారి పేరున సూర్యాపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కాబడిన దస్తావేజు నెం.3206/2016, తేది. 04-03-2016 దాఖలా వారి సంపూర్ణయాజమాన్యంలో గల ఇల్లు, సదరు ఇంటి నెం.1-7-207/2/11/1/5/B. ఆస్తి వివరము: జిల్లా రిజిస్ట్రార్ నల్లగొండ, సబ్ రిజిస్ట్రార్ సూర్యాపేట వారి జ్యూరిస్ డిక్షన్ లోను, సూర్యాపేట మున్సిపల్ పరిధిలోని, బి. మాధారం రెవిన్యూ గ్రామ శివారులోని సర్వే నెంబరు 329, ప్లాటు నెంబరు 106లో దక్షిణం వైపు భాగంలో నిర్మించిన ఇల్లు, సదరు ఇంటి స్థల విస్తీర్ణము 200.0 చ.గజములు, సదరు ఇంటిపై కప్పు కట్టుబడి ఆర్.సి.సి.తో గ్రౌండ్ ఫ్లోర్ విస్తీర్ణము 923.39 చ.అడుగులు మరియు మొదటి అంతస్థు కట్టుబడి విస్తీర్ణము 923.39 చ.అడుగులు గల వార్డు నెం.1, బ్లాక్ నెం.7లో చేరియుండి ముత్యాలమ్మ గుడి ఏరియాలో గల ఇంటికి హద్దులు. షెడ్యూలు ఆస్తి భూమికి గల హద్దులు: ఉత్తరం: ప్లాటు నెంబరు 106 లోని భాగము, దక్షిణం: మొరిశెట్టి శ్రీనివాస్ ప్లాటు నెంబరు 105, తూర్పు: యర్రోజు ఎల్లాచారి ప్లాటు నెంబరు 124, పడమర: 25 అడుగుల రోడ్డు.

ఇట్లు: సం/– **జటంగి వెంకటేశ్వర్లు,** న్యాయవాది
సెల్: 98488 45093, 99856 80549

లయన్స్ కంటి ఆసుపత్రి అభివృద్ధికి కృషి: ఆర్డీఆర్

సూర్యాపేట (తాళ్లగడ్డ), న్యూస్‌టుడే: ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి(ఆర్డీఆర్) అన్నారు. రాంరెడ్డి వరూధిని దేవి జ్ఞాపకార్థం లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో సూర్యాపేట మండలం కాసరబాద్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. సూర్యాపేట లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కంటి శస్త్ర చికిత్సలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గతంలో మీలా సత్యనారాయణ ఛైర్మన్‌గా ఉన్న సమయంలో తాను శాసనసభ్యుడిగా లయన్స్ కంటి ఆసుపత్రి నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్నానన్నారు. లయన్స్ కంటి ఆసుపత్రి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. శిబిరంలో సుమారు ఐదు వందల మందికి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కంటి అద్దాలు ఇవ్వడంతోపాటు సోమవారం నుంచి సూర్యాపేట కంటి ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్లు చెప్పారు. లయన్స్ కంటి ఆసుపత్రి ఛైర్మన్ దోసపాటి గోపాల్, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కోతి గోపాల్‌రెడ్డి, లయన్స్ క్లబ్ ఛైర్మన్ మర్రి లక్ష్మారెడ్డి, కోశాధికారి చిలుముల శ్రీనివాసరెడ్డి, నంద్యామల నర్సింహారెడ్డి, సురేశ్‌రెడ్డి, అబ్దుల్ రహీం పాల్గొన్నారు.



సూర్యాపేట: కాసరబాద్‌లో ఉచిత కంటి వైద్య శిబిరంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

టోకెన్ ఉంటేనే కొనుగోళ్లు..!



చివ్వెంల కొనుగోలు కేంద్రంలో ధాన్యం దిగుమతి చేస్తున్న దృశ్యం

❑ తేమ శాతం 17 వస్తేనే జారీ

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే:

నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల వ్యాప్తంగా 2024-25 వానాకాలం ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, వాటిల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం నిరంతరం తనిఖీలు చేపడుతోంది. పర్యవేక్షణకు మండల స్థాయిలోనూ కమిటీలు ఏర్పాటు చేశారు. అవకతవకల నివారణకు గతంలో మాదిరిగానే ఈసారి కూడా టోకెన్ల విధానం అమలు చేస్తున్నారు.

నిబంధనలు ఇలా..

- ముందుగా కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసిన సమయంలో నిర్వాహకులు రైతు పేరు, వివరాలు నమోదు చేసుకుంటారు.
- మండల వ్యవసాయ అధికారులు ధాన్యం తేమ శాతం పరిశీలిస్తారు.
- 17 శాతం తేమ వచ్చిన తరువాత సంబంధిత రైతుకు టోకెన్ అందిస్తారు.
- దాని ప్రకారం ధాన్యాన్ని బస్తాల్లో ఎప్పుడు నింపుతారు, మిల్లుకు ఎప్పుడు తరలిస్తారో.. చెబుతారు.

ఉమ్మడి జిల్లాలో కొనుగోలు కేంద్రాల వివరాలు

నల్గొండ 366
266 సూర్యాపేట
యాదాద్రి 275



అవకతవకలకు చెక్!

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 907 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. దాదాపు 10.42 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేసి సన్న, దొడ్డు రకం వడ్లను వేర్వేరుగా కొనడానికి కేంద్రాలు ఏర్పాటు చేశారు. టోకెన్ విధానం లేనప్పుడు కేంద్రం నిర్వాహకులు అవకతవకలకు పాల్పడేవారు. నగదు ముట్టజెప్పిన రైతుల ధాన్యాన్ని కాంటాలు వేశారు. మిల్లర్లు ఆ ధాన్యానికి కోత విధించేవారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. ఇతర గ్రామాల ధాన్యాన్ని, దళారుల సరకునూ ఆయా నిర్వాహకులు కొనుగోలు చేసేవారు. దీంతో కేంద్రాల వద్ద పడిగాపులు పడుతున్న రైతులు ఇబ్బందులు పడాల్సిన వచ్చేది. కొనుగోళ్లలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందనే ఆరోపణలు రావడంతో రెండేళ్ల క్రితం టోకెన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ విధానంతో అవకతవకలకు తావు లేకుండా సజావుగా కొనుగోళ్లు జరుగుతున్నాయి.

రైతులు ఏం చేయాలంటే..?

- ❑ రైతు తన వెంట ఆధార్ కార్డు, పట్టా పుస్తకం, బ్యాంకు పాస్ పుస్తకం నకలును రెండు సెట్లు తీసుకురావాలి.
- ❑ కౌలు రైతు మండల వ్యవసాయ అధికారుల వద్ద పేరు నమోదు చేసుకోవాలి.
- ❑ ఆధార్, పాస్‌పుస్తకాలను ఆన్‌లైన్ చేయించుకోవాలి.
- ❑ అప్పుడే ధాన్యం కాంటా పూర్తయిన రెండ్రోజుల్లో నగదు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుంది.

పారదర్శకంగా చేపట్టేలా ఆదేశాలు

– పద్మ, డీసీవో, సూర్యాపేట

రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపడుతున్నాం. పారదర్శకంగా కొనుగోళ్లు చేపట్టేలా నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశాం. తేమ శాతం వచ్చిన రైతులకు మాత్రమే టోకెన్ జారీ చేయాలని ఆదేశాలు జారీ చేశాం.

యువత చూపు.. మద్యపాన నిషేధం వైపు..!

◆ గొలుసు దుకాణాలకు అడ్డుకట్ట వేస్తున్న యువకులు



గట్టికల్‌లో మద్య నిషేధానికి కదిలిన యువకులు

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: అర్ధరాత్రి వరకు గొడవలు, ఘర్షణలు, నలభై ఏళ్లకే కాలేయం, మూత్రపిండాలు దెబ్బతిని ఇంటిపెద్ద మృతి, చిన్న వయసులోనే వితంతువుగా మారిన మహిళలు, వారిపై పిల్లల భారం, తాగొచ్చి భర్త చేసే అల్లరికి తాళలేక పుట్టింటికి వెళ్లిన భార్య.. ఆలుమగల పంచాయితీలో నలిగిన చిన్నారులు.. ఇవీ పల్లెల్లో విచ్చలవిడి మద్యం విక్రయాలతో కనిపిస్తున్న హృదయ విదారక దృశ్యాలు. పగలూ, రాత్రి మద్యం విక్రయించే గొలుసు దుకాణాలు పచ్చని సంసారాల్లో చిచ్చురేపుతున్నాయి. కుటుంబాలను రోడ్డున పడేస్తున్నాయి. ఈ ఘటనలను కళ్లారచూసిన యువత మద్యపాన నిషేధం వైపు అడుగులు వేస్తోంది. సూర్యాపేట జిల్లాలోని ఆత్మకూర్(ఎస్) మండలంలో పలు గ్రామాల్లో యువ చైతన్యం మద్యం మహమ్మారిపై ఉక్కుపాదం మోపుతోంది.

ఇస్తాళాపురంలో మొదలై..

మండలంలోని ఇస్తాళాపురం గ్రామంలో 2015 సెప్టెంబరు 21 నుంచి మద్యపాన నిషేధం అమలులోకి వచ్చింది. తొమ్మిదేళ్లు పూర్తి చేసుకొని పదో సంవత్సరంలోకి అడుగిడింది. ఈ గ్రామంలోని మహసేన, యువ, వింగ్స్ తదితర యువజన సంఘాల యువకులు ఏళ్లతరబడి పట్టుదలతో కట్టడి చేయడంతోపాటు జరిమానాలు విధిస్తున్నారు.

★ ఇస్తళాపురం గ్రామం స్ఫూర్తితో ఇటీవల అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా మండలంలోని గట్టికల్, పాతర్లపహాడ్ గ్రామాల్లో మద్యపానాన్ని నిషేధించాలంటూ తీర్మానాలు చేశారు. ఆ తీర్మానం గట్టికల్‌లో ఈ నెల 14 నుంచి, పాతర్లపహాడ్‌లో 16 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ ఉద్యమంలో యువజన సంఘాలు అఖిలపక్ష పార్టీలు, అధికారులకు, పోలీసులకు పూర్తి సహకారం అందిస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రజా చైతన్యం కోసం ద్విచక్ర వాహన ర్యాలీలు తీశారు. ప్రతి గొలుసు దుకాణానికి వెళ్లి అవగాహన కల్పించి మూసి వేయించారు. గట్టికల్‌లో జైభారత్, సర్దార్, అరుంధతి, కంఠమహేశ్వర, లెనిన్, సర్వోత్తమ్, చైతన్య జ్యోతి, గోల్డెన్‌స్టార్, బంగారుగడ్డ యువజన సంఘాల సభ్యులు ఉద్యమంలో పాలుపంచుకున్నారు.

★ పాతర్లపహాడ్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ యంగ్‌స్టార్ యువజన సంఘం, గోల్డెన్‌స్టార్, కౌండిన్య, నవోదయ యువజన సంఘం యువకులు అఖిలపక్ష నాయకులతో కలిసి గ్రామస్థులను చైతన్యపరిచారు. మండలంలో ముక్కుడుదేవులపల్లి, తుమ్మలపెన్‌పహాడ్‌లోనూ యువజన సంఘాల ప్రతినిధులు గొలుసు దుకాణాలను మూసి వేయించేందుకు గ్రామ పెద్దలతో చర్చలు జరుపుతున్నారు.

ఉల్లంఘిస్తే జరిమానా

– ఇరుగు కృష్ణకుమార్, మహసేన యువజన సంఘం, ఇస్తాళాపురం



మా గ్రామంలో 2015 నుంచి మద్యపాన నిషేధం అమలులో ఉంది. ఈ మధ్యకాలంలో కొందరు నిషేధాన్ని ఉల్లంఘిస్తే వెంటనే స్పందించి జరిమానా విధించాం. గ్రామస్థుల సహకారంతో ఇప్పటికీ కట్టుబాట్లను కఠినంగా అమలు చేస్తున్నాం.

పుస్తెలతాళ్లు కుదువపెడుతున్నారు

– మడ్డి శివ, సర్దార్ యువజన సంఘం, గట్టికల్



మద్యం విచ్చలవిడిగా దొరకడంతో మా గ్రామంలో అర్ధరాత్రి జనం తిరుగుళ్లు ఎక్కువయ్యాయి. గొడవలు, కొట్లాటలు పెరిగాయి. చివరకు భార్యల పుస్తెలతాళ్లు కుదువపెట్టే పరిస్థితి దాపురించింది. తాగి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకొని అమాయకులు చనిపోయారు. యువజన సంఘాలంతా ఏకమై మద్యపాన నిషేధ ఉద్యమంలో పాలుపంచుకున్నాం. గొలుసు దుకాణాలను పూర్తిగా మూసివేయించాం.

అమ్మ తినిపించాల్సిందే.. నాన్న ఎత్తుకోవాల్సిందే

మానవీయం

చౌటుప్పల్, న్యూస్‌టుడే: అమ్మ.. చిన్నతనంలో అందరి పిల్లల్లా అమ్మ పెట్టిన గోరుముద్దలు తిని, బుడిబుడి నడకలతో ఇల్లంతా సందడి చేసింది. మూడు కిలోమీటర్ల దూరంలోని ప్రభుత్వ పాఠశాలకు కాలినడకనే వెళ్లేది. ఓ రోజు బడికి వెళ్తా కాళ్లు అల్లుకుపోయి కింద పడిపోయింది. బిడ్డకేమైందోనని అయోమయంలో ఆ తల్లిదండ్రులు డాక్టర్లకు చూపించారు. చికిత్స కోసం అప్పులు చేసి రూ.నాలుగు లక్షలు ఖర్చు చేశారు. నయం కాలేదు. క్రమంగా కాళ్లు, చేతులు, శరీరం చచ్చుబడిపోవడంతో చదువు మాన్పించేశారు. ఆమెకు కండరాల క్షీణత వ్యాధి వచ్చిందని, చికిత్స ఏమీ లేదని వైద్యులు తేల్చి చెప్పడంతో ఆ కన్నవారి గుండె పగిలిపోయింది.



ఉదరి రమణకు గోరు ముద్దలు తినిపిస్తున్న తల్లిదండ్రులు

పదో తరగతిలో ఉండగా..

చౌటుప్పల్ పురపాలిక పరిధి లింగారెడ్డిగూడానికి చెందిన ఉదరి యాదమ్మ, ఈశ్వరయ్యలకు ముగ్గురు సంతానం. తమ పిల్లలు తమలాగా పారిశుద్ధ్య కూలీలుగా మారకూడదని ఊళ్లోని ప్రభుత్వ పాఠశాలకు పంపించారు. అక్కడ అయిదో తరగతి పూర్తయ్యాక మూడు కిలోమీటర్ల దూరంలో చౌటుప్పల్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. అక్కాచెల్లెళ్లు కాలినడకన బడికి వెళ్లి సాయంత్రం ఇంటికి చేరేవారు. పదో తరగతి చదువుతున్న పెద్దమ్మాయి రమణ ఓ రోజు ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా కింద పడిపోయింది. అప్పటి నుంచి ఆమె కోలుకోలేదు.

నేటికీ అందని 'ఆసరా'

రెక్కాడితేగాని డొక్కాడని ఆ నిరుపేద తల్లిదండ్రులు గత పదిహేనేళ్లుగా కదల్లేని తన బిడ్డను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. ప్రస్తుతం ముప్పయ్యేళ్ల వయసున్న రమణ కనీసం చేతితో అన్నం కలిపి ముద్ద నోట్లో పెట్టుకోలేని, శరీరం కదిలించలేని స్థితిలో ఉన్నారు. తల్లిదండ్రులే గోరు ముద్దలు తినిపిస్తున్నారు. కూలి మానుకుని అమ్మా, నాన్నే సాయంగా ఉంటున్నారు. తమ కుమార్తె నూరుశాతం దివ్యాంగురాలని 'సదరం' ధ్రువపత్రం జారీ చేసి పదకొండేళ్లవుతోందని, దరఖాస్తు చేసినా 'ఆసరా' పింఛను మంజూరు కాలేదని ఆ తల్లి దండ్రులు కన్నీరు పెడుతున్నారు.

చదువు ఇష్టం లేక విద్యార్థిని బలవన్మరణం

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: చదువు ఇష్టం లేదని పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ బాలిక చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందిన ఘటన మిర్యాలగూడ పరిధిలో చోటుచేసుకుంది. మిర్యాలగూడలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాల సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. దామరచర్ల మండల పరిధిలోని ఓ తండాకు చెందిన బాలిక(14) పట్టణంలోని పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. దసరా సెలవులకు ఇంటికి వెళ్లిన బాలిక.. తిరిగి ఈ నెల 18న మధ్యాహ్నం తండ్రితో కలిసి పాఠశాలకు వచ్చింది. సాయంత్రం తనకు కళ్లు తిరుగుతున్నాయని.. తోటి విద్యార్థులకు చెప్పగా వారు స్టాఫ్ నర్సుకు సమాచారం అందించారు. ఈ క్రమంలో తాను ఇంటి వద్ద పురుగు మందు తాగి వచ్చానని తెలపడంతో స్థానిక ప్రాంతీయాసుపత్రికి.. అక్కడి నుంచి నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతదేహానికి అక్కడే మరణోత్తర పరీక్షలు నిర్వహించి.. తల్లిదండ్రులకు అప్పగించారు. గిరిజన గురుకుల ఆర్సీవో అగస్టిన్.. విద్యార్థిని మృతిపై కలెక్టర్‌కు నివేదిక అందించారు. తన కుమార్తెకు చదువు ఇష్టం లేకనే ఆత్మహత్యకు పాల్పడినట్లు బాలిక తల్లి స్థానిక రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సెలవులకు ఇంటికి వచ్చిన బాలిక తాను పాఠశాలకు వెళ్లనని చెప్పటంతో నచ్చజెప్పి పంపించారు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక ఇంటి వద్దే ఎవరికీ తెలియకుండా పురుగు మందు తాగి పాఠశాలకు వచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రెండో పట్టణ సీఐ నాగార్జున తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యంపై ఆందోళన..

నల్గొండ నేరవిభాగం: మిర్యాలగూడలోని గురుకుల పాఠశాలలో చదువుతున్న బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆమె మృతి చెందడానికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. పలు సంఘాల సభ్యులతో కలిసి ఆసుపత్రి ఎదుట ఆందోళన చేశారు. సమాచారం తెలుసుకున్న అవుట్‌పోస్టు పోలీసులు ఆందోళన విరమింపజేశారు. తమకు న్యాయం చేయాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి దుర్మరణం



జానకిరాములు

చివ్వెంల, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సూర్యాపేట జిల్లా కేంద్ర సమీపంలోని నాల్గో వార్డు ఖాసీంపేటలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పందుల జానకిరాములు(50) గ్రామంలోని ఓ రైతు పొలానికి పురుగు మందు పిచికారీ చేసేందుకు వెళ్లారు. పొలంలోకి దిగి మందు పిచికారీ చేస్తుండగా.. అప్పటికే పొలంలో తెగిపడి ఉన్న విద్యుత్తు తీగను గమనించక తొక్కడంతో షాక్ గురై అక్కడికక్కడే మృతిచెందారు. పక్కనే ఉన్న రైతు మద్ది శ్రీనివాస్ అతన్ని కాపాడేందుకు ప్రయత్నించగా.. అతనికి సైతం గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తీగ తెగి పడినా మరమ్మతు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడంతోనే ప్రమాదం జరిగిందని మృతుడి కుమారుడు శివ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కనకరత్నం తెలిపారు.

పత్తి విక్రయానికి సాంకేతిక సాయం

★ యాప్‌లో కొనుగోలు కేంద్రాల సమాచారం

ఆలేరు, న్యూస్‌టుడే: మద్దతు ధరకు పత్తి విక్రయించడంలో రైతులు ఇబ్బందులు పడకుండా మార్కెటింగ్ శాఖ సమాచారం అందించేందుకు సాంకేతికతను అందుబాటులోకి తీసుకువచ్చింది. వాట్సప్ అప్లికేషన్‌తో ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ కొనుగోలు విధానాలను ఎప్పటికప్పుడు తెలియజేసేలా చర్యలు తీసుకుంటోంది. సీసీఐ కేంద్రాలకు వచ్చిన సమయం, పత్తి ఖరీదు, డబ్బుల చెల్లింపులు ఏ స్థాయిలో ఉందనే సమాచారం తెలుస్తుంది. మార్కెటింగ్ శాఖ తాజా చర్యలతో రైతులు సీసీఐ కేంద్రాలున్న జిన్నింగ్ మిల్లుల్లో విక్రయానికి నిరీక్షించే అవసరం ఉండదు. ఏ కేంద్రంలో ఎంత పత్తి ఉంది?, అక్కడ సరకు విక్రయించడానికి ఎంత సమయం పడుతుందనే వివరాలను సైతం రైతులు ముందుగా తెలుసుకునే అవకాశం ఉంటుంది.

రైతులు చేయాల్సిందిలా..

☛ సీసీఐ పత్తి విక్రయాలకు చరవాణి నెంబరు 88972 81111 సేవ్ చేసుకోవాలి.

☛ ఈ నెంబరుకు వాట్సప్‌లో 'హై(హెచ్ఐ)' అని టైపు చేయాలి. వన్‌సాఫ్ట్ సిస్టమ్ ప్రైవేట్ లిమిటెడ్ యాప్ ఓపెన్ అవుతుంది.

☛ ఇంగ్లిషు, తెలుగు, హిందీ భాషను ఎంచుకోవాలి.

☛ పత్తి విక్రయ సమాచారం, తక్‌పట్టి వివరాలు, కొనుగోలు కేంద్రంలో వేచి ఉండే సమయం కనిపిస్తాయి.

☛ ఆ రైతు నుంచి సీసీఐ ఎన్ని క్వింటాళ్ల పత్తి కొంటుందో చూపుతుంది.

ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో ఇలా...

ఈ ఏడాది వానాకాలంలో ఉమ్మడి నల్గొండ జిల్లాలో 7.18 లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. ఇది గతేడాది కన్నా సుమారు 60 వేల ఎకరాలు ఎక్కువ. ఎకరాకు సుమారు 8-14 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 65 లక్షల క్వింటాళ్ల వరకు దిగుబడిగా వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

భార్యకు పురుగు మందు ఇచ్చి తాగిన భర్త మృతి

◆ కుమార్తె పెళ్లైన నాలుగు రోజులకు ఘటన




బడుగుల వెంకటయ్య

గుర్రంపోడు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఓ ఇంట్లో కుమార్తె వివాహం జరిగి నాలుగు రోజులు కూడా గడవకముందే తీరని విషాదం నెలకొంది. పెళ్లికూతురు తండ్రి తన భార్యకు పురుగు మందు తాగించి.. తానూ తాగిన ఘటనలో ఆయన మృతిచెందగా.. ఆమె ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతోంది. ఈ ఘటన గుర్రంపోడు మండలం మొసంగి గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బడుగుల వెంకటయ్య(45), జ్యోతి దంపతులకు ఇద్దరు కుమార్తెలు రమణ, లలిత, కుమారుడు రామాంజనేయులు ఉన్నారు. ఈనెల 16న తన పెద్ద కుమార్తె రమణ వివాహం చిల్కాపురం గ్రామానికి చెందిన యువకుడితో జరిపించారు. 19న సత్యనారాయణస్వామి వ్రతంలో వెంకటయ్య, జ్యోతి దంపతులు పాల్గొని సాయంత్రం తిరిగి స్వగ్రామానికి వచ్చారు. ఉదయం బయటికెళ్లిన వెంకటయ్య మధ్యాహ్నం రెండింటికి ఇంటికి రావటంతో భార్య మందలించారు. 'మొన్ననే కుమార్తె పెళ్లి జరిపించాం.. నీవు ఇలా తాగుతూ కాలం గడిపితే ఎలా' అంటూ అరిచారు. వెంకటయ్య ఆమెకు తెలియకుండా పురుగు మందు కలిపిన కూల్‌డ్రింక్‌ను ఆమెకు ఇచ్చి తాగు అంటూ తానూ దాన్ని తీసుకుని ఓ గదిలోకి వెళ్లి తలుపేసుకున్నారు. ఎంతకీ వెంకటయ్య బయటికి రాకపోయేసరికి అనుమానించిన భార్య కిటికీలోంచి చూడగా వెంకటయ్య అపస్మారక స్థితిలో ఉండటం గ్రహించి బంధువులను పిలిచారు. అతన్ని నల్గొండలోని ఓ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందారు. కొంత సమయానికి జ్యోతి కడుపులో కూడా తిప్పటం మొదలవగానే ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రిలోని వార్డుకు తరలించారు. వెంకటయ్య మృతదేహాన్ని అక్కడే శవాగారంలో భద్రపరిచారు. ఏఎస్సై ప్రభాకర్‌రెడ్డి చికిత్స పొందుతున్న జ్యోతిని పరామర్శించి ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు.

యాదాద్రి ఆలయ పరిసరాల్లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి రీల్స్

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిసరాల్లో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇటీవల రీల్స్ చేసిన దృశ్యాలు ఆదివారం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. ఆయన సతీమణి, కుమార్తె జన్మదినం సందర్భాల్లో కౌశిక్‌రెడ్డి కుటుంబ సమేతంగా ఆలయాన్ని సందర్శించి వీడియోలు చిత్రీకరించుకున్నారు. కుమార్తెతో ఆలయ ప్రాంగణంలో రీల్స్ చేయించారు. ఎమ్మెల్యే పదవిలో ఉన్న ఆయన ఇలా రీల్స్ చేయడం సరికాదని భక్తులు అభ్యంతరం తెలిపారు. ఈ విషయమై ఈవో భాస్కర్‌రావు వివరణ కోరగా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఆలయంలో చిత్రీకరణ కోసం అనుమతి కోరగా ఇవ్వలేదని, ఆలయం బయట సాధారణ భక్తుల మాదిరిగా తీసుకోవచ్చని సూచించామని ఈవో వివరించారు.

కాచరాజుపల్లి సొగసు చూడతరమా!



ఓ పక్క కృష్ణా వెనుక జలాలు.. మరోవైపు భూమికి పచ్చని రంగేసినట్లు పైర్లు. వీటి మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో అలరారుతోంది.. కాచరాజుపల్లి. చందంపేట మండలంలో కృష్ణా నది ఒడ్డున ఈ గ్రామం ఉంది. ఆరునెలల పాటు కృష్ణా జలాలు, మరో ఆరు నెలలు బీడు పట్టి ఉండటం ఆ గ్రామ ప్రత్యేకత. ఈ ఏడాది వర్షాలు అనుకూలించడంతో రైతులు చేపల వేటకు వెళ్తుండగా.. మహిళలు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. చుట్టూ నల్లమల అటవీ ప్రాంతం.. మధ్యలో కృష్ణా వెనుక జలాలు, పచ్చని పైర్లు చూపరులను కనువిందు చేస్తున్నాయి. ఇక్కడ ఆధ్యాత్మిక కేంద్రాలూ ఉండటంతో దర్శనానికి వచ్చిన భక్తులు, పర్యాటకుల సందడి రోజురోజుకూ పెరుగుతోంది.

– చందంపేట, న్యూస్‌టుడే:

ఆరు తరాలు.. 141 కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం



మట్టపల్లిలో వంశ వృక్షం వేదికగా కలిసిన కుటుంబ సభ్యులు

బంధాలను చరవాణులకే పరిమితం చేసి బంధువులు సైతం ఒకరినొకరు పరిచయం చేసుకునే దుస్థితికి దిగజారిన ప్రస్తుత రోజుల్లో ఆరు తరాలకు చెందిన 141 కుటుంబాలు ఒకే వేదికపై కలుసుకొని ఆనందాన్ని పంచుకున్నారు. మఠంపల్లి మండలం మట్టపల్లి క్షేత్రంలోని ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రంలో ఆదివారం వారి వంశవృక్షం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. విదేశాలతో పాటు వివిధ రాష్ట్రాలలోని బంధు గణమంతా కదిలివచ్చి అస్మదీయుల అభిమానానికి పాత్రులయ్యారు. 300లకు పైగా ఈ సమ్మేళనానికి హాజరై తమ అపూర్వ కలయికకు మూలమైన వంశాధిపతి దంపతులకు నివాళి అర్పించి అనంతరం జరిగిన ఆత్మీయ వేడుకలో పాలు పంచుకున్నారు. నాలుగు దశాబ్దాల కిందట దివంగతులైన నేరేడుచర్లకు చెందిన రాచకొండ వీరయ్య, లక్ష్మమ్మ దంపతుల జ్ఞాపకార్థం వీరి ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెల ఆరు తరాల సంతానం (ముని మనవళ్లు, వారి మనవళ్లు) 411 మంది కాగా మూడు వందలకు పైగా ఇక్కడి వేదికపై కలుసుకున్నట్లు పరిచయకర్త రాచకొండ శ్రీనివాస్ తెలిపారు. శ్రీనాథ్, నాగరాజు, నాగేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు స్ఫూర్తిదాయక సమ్మేళనంలో కీలకంగా వ్యవహరించారన్నారు.

- మఠంపల్లి, న్యూస్‌టుడే:

బాలల పరిరక్షణాధికారి విచారణ

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: బాలసదన్‌లో ఓ ఉద్యోగి అసభ్యంగా ప్రవర్తించాడని బాలిక ఆరోపించగా బాలల పరిరక్షణాధికారి సైదులు ఆదివారం విచారణ జరిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 14న అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలసదన్‌లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన కోర్టు ఉద్యోగి(ఆఫీస్ సబార్డినేట్) ఒకరు ఓ బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించాడని బాలల పరిరక్షణాధికారికి ఫిర్యాదు చేసింది. ఆయన విచారణ జరపగా బాలసదన్ సిబ్బంది అలాంటిది ఏం జరగలేదని చెప్పగా సదరు బాలిక తనపై బ్యాడ్ టచ్ చేసిన మాట వాస్తవమని చెప్పింది. బాలల సంరక్షణ సమితి, బాలల పరిరక్షణ విభాగం అధికారులు బాలసదన్‌లో సరైన పర్యవేక్షణ లేకపోవడంతో అనేక ఘటనలు చోటు చేసుకుంటున్నాయని పలు స్వచ్ఛంద సంస్థలు ఆరోపిస్తున్నాయి.

పల్లె దవాఖానాలకు సొంత భవనాలెప్పుడో..?



ప్రైవేటు భవనంలో నడుస్తున్న ఆరోగ్య ఉపకేంద్రం

మిర్యాలగూడ, న్యూస్‌టుడే:

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె దవాఖానాలకు సొంత భవనాల నిర్మాణాల్లో ఏళ్ల తరబడి జాప్యం జరుగుతోంది. దీంతో అద్దె భవనాల్లో అసౌకర్యాల నడుమ సేవలందిస్తున్నారు. మండలానికి ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండగా ..గ్రామాల వారంతా సాధారణ జ్వరాలకు ఇక్కడికి వచ్చేందుకు దూరం అవుతుండటంతో ప్రభుత్వం పల్లెదవాఖానాలను, ఆరోగ్య ఉపకేంద్రాలను ప్రారంభించింది. వీటిని ఆయా గ్రామాల వాసులకు అనుకూలంగా ఉండేలా ఎంపిక చేసి మంజూరు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15వ ఆర్థిక సంఘం నిధులు, జాతీయ ఆరోగ్య మిషన్ నిధులు, టీఎస్ఎంఐడీసీ నిధులతో నిర్మాణాలు చేయాలని నిర్ణయించారు. జ్వరాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున ఉన్నతాధికారులు స్పందించి పల్లెదవాఖానాల నిర్మాణాలను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు సౌకర్యంగా ఉండేలా చూడాలి గ్రామాల వాసులు కోరుతున్నారు. మంజూరైనా పల్లెదవాఖానాల నిర్మాణాలు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేలా చూస్తామని జిల్లా ఉపవైద్యాధికారి గీతావాణి తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో ఆసుపత్రుల పరిస్థితి:

★ నల్గొండ జిల్లాలో మొత్తం పల్లెదవాఖానాలు 164 మంజూరయ్యాయి. 80 పల్లెదవాఖానాలకు నిధులు విడుదల చేశారు. కాగా వీటిలో కొన్ని ప్రారంభం కాగా, మిగతావి అసంపూర్తిగా ఉన్నాయి. 24 టీఎస్ఎంఐడీసీ నిర్మించాల్సి ఉండగా నిధులు విడుదల కాలేదు. మిగతా 60 పల్లెదవాఖానాలకు జాతీయ ఆరోగ్య మిషన్ నిధులు కేటాయించాల్సి ఉంది.

★ సూర్యాపేట జిల్లాలో 109 పల్లె దవాఖానాలు మంజూరు కాగా కేవలం 29 భవనాలకు మాత్రమే నిధులు కేటాయించారు. ఒక్కో భవనానికి రూ.20 లక్షలు కేటాయించగా ఈ నిధులు సరిపోవని, పెంచాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా నిర్మాణ పనులు ప్రారంభించలేదు. మిగతా 80 భవనాలకు ఎలాంటి నిధులు కేటాయించలేదు. దీంతో నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు.

★ యాదాద్రి జిల్లాలో 99 పల్లె దవాఖానాలు మంజూరు కాగా.. వీటిలో భవనాలు ఉన్నవి 36. మిగతా 63 భవనాలకు నిధులు కేటాయించగా.. ఇప్పటి వరకు నిర్మాణాలు మాత్రం ప్రారంభం కాలేదు.



ప్రారంభానికి నోచుకోని జప్తివీరప్పగూడెం గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రం

ఆంగ్లం అర్థం కావడం లేదని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

కోదాడ, చిలుకూరు, న్యూస్‌టుడే: పుట్టినప్పటి నుంచి మాతృభాష తెలుగులో చదివి, ఇంటర్ వచ్చే సరికి ఆంగ్ల మాధ్యమం కావడంతో చదువు అర్థం కాక ఓ విద్యార్థి తనువు చాలించిన ఘటన చిలుకూరు మండలంలోని ఓ ప్రైవేటు ఇంటర్ కళాశాలలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకవీడు మండలం సజ్జాపురం గ్రామానికి చెందిన ఓ విద్యార్థి(17) చిలుకూరు మండల కేంద్రంలోని కళాశాలలో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. దసరా సెలవులు ముగియడంతో అతన్ని తన మేనమామ కళాశాలకు తీసుకొచ్చారు. కళాశాల యాజమాన్యం ఆ విద్యార్థికి మార్కులు తక్కువగా వస్తున్నాయని మేనమామ దృష్టికి తీసుకొచ్చి మందలించింది. ఆంగ్ల మాధ్యమంలో సబ్జెక్టులు అర్థం కావట్లేదని ఎవరికీ చెప్పుకోలేక మనస్తాపానికి గురైన విద్యార్థి హాస్టల్ గదిలోనే ఉరి వేసుకున్నారు. కళాశాల సిబ్బంది గమనించి కోదాడ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గంట క్రితమే కళాశాలకు పంపించామని, అంతలోనే మృతి చెందడం ఏంటనీ బంధువులు ఆరోపిస్తున్నారు. తమలాగా కూలీ పనులు చేయకుండా, ఉన్నత చదువులు చదివి ఉద్యోగం సాధిస్తాడనుకున్న కొడుకు కళ్ల ముందే విగతజీవిగా పడి ఉండటంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. విద్యార్థి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని చిలుకూరు ఎస్సై రాంబాబు తెలిపారు.

★ తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు కావడంతో మేనమామ కళాశాలలో దింపేందుకు వాహనంపై విద్యార్థిని తీసుకొచ్చారు. 'గణిత పుస్తకం తీసుకొని రా మామయ్య' అని చివరగా మేనల్లుడు చెప్పాడని, సోమవారం పుస్తకం తీసుకొస్తానని చెప్పాన'ని మేనమామ కన్నీటి పర్యంతమయ్యారు.

29న ఎమ్మార్పీఎస్ ధర్మయుద్ధం సదస్సు

నీలగిరి: ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా కమిటీ పేరుతో కాలయాపన చేయడాన్ని మానుకోవాలని ఎంఎస్పీ సీనియర్ నాయకుడు కందుకూరు సోమన్న మాదిగ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నల్గొండలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఉమ్మడి జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ నెల 29న నల్గొండలో నిర్వహించే ధర్మయుద్ధం సదస్సును విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ మాదిగ, మాదిగ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గాదె రమేశ్, ప్రజా సంఘాల నాయకులు యాతాకుల రాజన్న మాదిగ, నల్ల చంద్రస్వామి మాదిగ, ఇరిగి శ్రీశైలం మాదిగ, వినయ్ మాదిగ, వెంకన్న మాదిగ, సైదులు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	120-00
రిటైల్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

కోదాడ

•కోదాడ •హుజూర్‌నగర్

కార్మిక హక్కులు సాధించిన ఘనత సంఘానిదే

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని గీత పనివారల సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కాటమయ్య గుడి వద్ద సీనియర్ నాయకుడు బెల్లంకొండ చిరంజీవి జెండా ఎగరవేశారు. ధర్మభిక్షం నాయకత్వంలో ఏర్పడిన గీత పనివారల సంఘం వేలం పాట విధానాన్ని, వివిధ పన్నులను రద్దు, టీసీఎస్, టీపీటీల ఏర్పాటు, గీత కార్మికులకు పరిహారం, తాటి, ఈత వనాన్ని పెంచేందుకు 5 ఎకరాల భూమి, 50 సంవత్సరాలు నిండిన వారికి పింఛన్ తదితర హక్కులు సాధించిందని సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పాలకూరి బాబు తెలిపారు.


హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న గీత పనివారల సంఘ నాయకులు

నేరేడుచర్ల: గీతకార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు కోరారు గీతపనివారల సంఘం 67వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

చిలుకూరు: గీత వృత్తిని ప్రభుత్వం పరిరక్షించాలని గీత పనివారల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోటయ్య అన్నారు. సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో గీత కార్మికులను సన్మానించి మాట్లాడారు. అనంతరం సంఘం వ్యవస్థాపకుడు ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

కేంద్రాలు ప్రారంభించి... ధాన్యం తూకం వేసి


అనంతగిరి: కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేస్తున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

అనంతగిరి, న్యూస్‌టుడే: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి రైతులు మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ధాన్యం తూకం వేశారు. మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు, ఆర్డీవో సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మునగాల గ్రామీణం: నాణ్యమైన దిగుబడులు తీసుకొచ్చి రైతులు మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. బరాఖత్‌గూడెంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం కాటమయ్య దేవాలయానికి స్థలం కేటాయించాలని గ్రామంలో గౌడ కులస్థులు వినతి పత్రం అందజేశారు. కలకోవకు చెందిన నాయకులు శ్రీను, శంకర్ గ్రామంలోని రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం పక్కన ఉన్న ఇళ్ల స్థలాలను నిరుపేదలకు పంపిణీ చేయాలని వినతిపత్రం అందజేశారు.

కోదాడ గ్రామీణం: ధాన్యం కొనుగోళ్లలో జాప్యం తగదని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. నల్లబండగూడెంలో చిమిర్యాల ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే చందర్‌రావుతో కలిసి ప్రారంభించారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ వరి రకానికి రూ.2,320లను అందిస్తున్నట్లు తెలిపారు. సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

చిలుకూరు: మండల కేంద్రంలోని ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ప్రారంభించారు.

కోదాడ: జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని సూర్యాపేట జిల్లా గ్రంథాలయాల సంస్థ ఛైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పద్మావతిరెడ్డితో సమావేశమై మాట్లాడారు. కోదాడ నుంచి గ్రంథాలయాల ఛైర్మన్‌గా నియామకం కావడంతో రామారావును ఎమ్మెల్యే, కాంగ్రెస్ శ్రేణులు సన్మానించారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

మోతె: బుర్కచర్ల, రాంపురంతండా తదితర గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐకేపీ ఏపీఎం వెంకయ్య స్థానిక కాంగ్రెస్ మండల నాయకులతో కలిసి ప్రారంభించారు. మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
80085 50363
96030 18889

మఠంపల్లి, న్యూస్‌టుడే:


? మఠంపల్లిలో తరచూ విద్యుత్తు అంతరాయం ఏర్పడుతోంది. ఎప్పుడు సరఫరా ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది -కోటేశ్వరరావు, మఠంపల్లి

✔ మేళ్లచెరువు సహా మండల వ్యాప్తంగా ఎక్కడ 33 కేవీ లైన్లకు మరమ్మతులు చేపట్టాలన్నా మఠంపల్లి 132 కేవీ ఉప కేంద్రం నుంచే ఎల్‌సీ తీసుకోవాల్సి వస్తోంది. ప్రత్యామ్నాయ ప్రయత్నాలు చేస్తున్నాం. -హరీశ్‌రెడ్డి, ఏఈ.

సామాజిక చిత్రం.. సృజనకు ఛత్రం



గరిడేపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేందుకు ఉపాధ్యాయులు అనేక రకాల కోర్సులు నేర్పిస్తున్నారు. స్వయం ఉపాధి పొందే విషయాలతో పాటు బాలికలకు నచ్చిన అంశాలపై దృష్టి సారిస్తూ ప్రోత్సహిస్తున్నారు. గరిడేపల్లి కస్తూర్బా బాలికల విద్యాలయంలో విద్యార్థినులు చిత్ర లేఖనంలో ప్రతిభ చూపుతున్నారు. సామాజిక ఇతివృత్తంతో కూడిన చిత్రాలను గీయడంలో ఆరితేరుతున్నారు. కాగితాలపై, గోడలపై చిత్రాలు గీస్తూ అబ్బుర పరుస్తున్నారు. గ్రామీణ నేపథ్యం, వినాయకుని చిత్రాలు, దేవుని ప్రతిరూపాలను ఇట్టే గీస్తున్నారు. మరింత తర్ఫీదు తీసుకుని రాష్ట్ర స్థాయిలో జరిగే చిత్రలేఖనం పోటీలలో పాల్గొనడానికి అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఒక వైపు పాఠశాలలో పాఠ్యాంశాలు నేర్చుకుంటూనే ఇతర సామాజిక అంశాలు, సాంస్కృతిక అంశాలకు సంబంధించిన చిత్రాలు గీయడం అలవాటుగా మార్చుకున్నారు. కరాటే, క్విజ్, ఆంగ్లంపై పోటీలు, ఆటలు, ఖాళీ సమయాలలో సాధన చేస్తూ మానసిక ఆనందం, శారీరక దృఢత్వం పొందుతున్నారు. ప్రత్యేకంగా క్రాఫ్ట్ టీచరు ఉండటంతో వారికి అనేక అంశాలను నేర్చుకునేందుకు అవకాశం దొరుకుతుంది. ఇప్పటికే వృథా వస్తువులతో రకాలైన ఫ్లవర్‌వాజ్‌లు, బుకేలు, క్రాఫ్ట్ అంశాలు సులువుగా నేర్చుకుంటున్నారు. బాలికలు ఏ అంశం నేర్చుకోవడానికి ఆసక్తి ఉందో తెలుసుకుని వాటినే నేర్పిస్తున్నారు.


ప్రకృతిని, సమాజాన్ని కాపాడే స్వచ్ఛ దోస్త్ అని చెప్పే చెట్టు బొమ్మ

ఇష్టమని నేర్చుకుంటున్నా...



సింధు, ఎనిమిదో తరగతి

చదువుతో పాటు చిత్ర లేఖనంపై ఇష్టం ఎక్కువ. చిన్న బొమ్మలు గీయడం అలవాటు చేసుకున్నా. క్రమంగా పెద్ద చిత్రాలైనా గీసేందుకు ప్రయత్నిస్తున్నా. పర్యావరణం, ప్రకృతి సంబంధ చిత్రాలు, మానవ శరీర అవయవాలు గీయడమంటే ఇష్టం. ఇలాగే రాణించి డ్రాయింగ్ టీచర్ అవడానికి కష్టపడి చదువుతా.

బొమ్మలు ఏవైనా గీస్తాం



బాణావత్ కావ్య, పదో తరగతి

పలు దినపత్రికలు, ఆదివారం వచ్చే కార్టూన్లు గ్రామీణ ప్రాంత వాతావరణం ప్రతిబింబించే చిత్రాలు, దేవుని బొమ్మలు గీయడం ఆసక్తి. మున్ముందు ఇంకా తర్ఫీదు పొంది అన్ని చిత్రాలు గీసేందుకు ప్రయత్నిస్తా.

విప్లవ సమాజానికి పునాదులు విద్యార్థులు

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: పీడీఎస్‌యూ విద్యార్థులు విప్లవ సమాజానికి పునాదులని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఖాసీం అన్నారు. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం అర్ధ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆదివారం నిర్వహించిన కేఆర్ఆర్ పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ప్రొఫెసర్ సాయిబాబా పోరాట స్ఫూర్తిని కళ్లకు కట్టించారు. మధ్య భారతదేశంలో ఆదివాసి కాళ్ల కింద ఉన్న సంపదను భారత సమాజానికి దక్కకుండా పాశ్చాత్య దేశాలకు తరలిస్తున్న పాలక వర్గాలపై సాయిబాబా పోరాటం చిరస్మరణీయంగా నిలుస్తుందన్నారు. సాహిత్య అకాడమీ మాజీ ఛైర్మన్ జూలూరు గౌరీశంకర్ మాట్లాడారు. ప్రగతిశీల భావజాలంతో కేఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులం గ్రామాల్లోకి వెళ్లి ప్రజలను చైతన్య పరిచామన్నారు. అంతకు ముందు విద్యార్థి అమరవీరులకు నివాళి అర్పించారు. పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు రాయపూడి చిన్ని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రామిరెడ్డి, ధర్మార్జున్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సింహాద్రి, చందర్‌రావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


ఉత్సవాల్లో భాగంగా మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఖాసీం

'రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్'


మునగాల: జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న భారాస జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్, నాయకులు

మునగాల, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతు భరోసా అందజేసే వరకు భారాస పోరాటం ఆగదని భారాస జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ వైద్యశాల వద్దనున్న జాతీయ రహదారిపై జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, జిల్లా నాయకుడు అజయ్‌కుమార్‌తో కలిసి ఆదివారం ధర్నా నిర్వహించారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతు రబీ నుంచి భరోసా ఇస్తామనడం సరిగాదన్నారు. ఆచరణకు అనుకూలంగా లేని హామీ ఇచ్చి సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేశారన్నారు. హైడ్రా పేరుతో బుల్డోజర్ పాలనను తీసుకొచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు.

కోదాడ పట్టణం: రైతులకు ఎకరానికి రూ.15వేల రైతు భరోసా అందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి, ఇవ్వకుండా రైతులను మోసం చేస్తున్నారని భారాస పట్టణ అధ్యక్షుడు షేక్.నయీమ్ అన్నారు.

నడిగూడెం: భారాస పార్టీ మండల అధ్యక్షుడు పి.నర్సిరెడ్డి, ఆంజనేయులు, శ్రీనివాసరెడ్డి, మహేష్ గౌడ్, జానీ నిరసన వ్యక్తం చేశారు.

హుజూర్‌నగర్: కాంగ్రెస్ ఎన్నికలలో రైతు భరోసా అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన తరువాత రైతులను మోసం చేస్తుందని భారాస నాయకులు విమర్శించారు. వివేకానంద సెంటర్‌లో రాస్తారోకో చేశారు.

గరిడేపల్లి: రైతు భరోసా ఎగవేశారని, రుణమాఫీ చేయలేదని నిరసిస్తూ భారాస ఆధ్వర్యంలో ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు చేశారు.

నేరేడుచర్ల: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని డీసీసీబీ డైరెక్టర్ అప్పిరెడ్డి విమర్శించారు. భారాస ఆధ్వర్యంలో నేరేడుచర్ల ప్రధాన కూడలి వద్ద నిరసన వ్యక్తం చేశారు.


కోదాడ: ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న భారాస పట్టణ అధ్యక్షుడు షేక్.నయీమ్, నాయకులు


హుజూర్‌నగర్: వివేకానంద సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న భారాస శ్రేణులు

అనంతగిరి: వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు పెట్టుబడి సాయం అందించలేదని భారాస శ్రేణులు ధర్నా నిర్వహించారు.

మోతె: రైతు భరోసా ఎగ్గొట్టిన సర్కారు అంటూ భారాస కార్యకర్తలు పెద్దఎత్తున ఆందోళనలు, నిరసనలు నిర్వహించారు. మండలకేంద్రంలో సూర్యాపేట-ఖమ్మం రహదారిపై భారాస మండలాధ్యక్షుడు సైదులు ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు.

చిలుకూరు: రైతు భరోసా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో భారాస శ్రేణులు ధర్నా నిర్వహించారు. మండల అధ్యక్షుడు జానకీ రామచారి, సురేశ్ పాల్గొన్నారు.


మునగాల ఎంపీపీఎస్ పాఠశాల


పెచ్చులూడిన తరగతి గది పైకప్పు

శిథిలావస్థలో పాఠశాల

మునగాల, న్యూస్‌టుడే: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని చెబుతున్నా అది క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో సౌకర్యాల లేమి ఇందుకు నిదర్శనం. మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. పాఠశాల తరగతి గదులతోపాటు వరండా పైకప్పు పెచ్చులు ఊడి ఇనుప చువ్వలు తేలాయి. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక గదిలో కొన్ని తరగతులు, చెట్ల కింద కొన్ని తరగతుల విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. ఎప్పుడు ప్రమాదం వస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాన్ని కూల్చివేసి నూతన భవనాన్ని నిర్మించాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం

వెంకటేశ్వర్లు, మండల విద్యాశాఖాధికారి

పాఠశాల పైకప్పు పెచ్చులూడి విద్యాబోధనకు ఇబ్బందికరంగా ఉన్న మాట వాస్తవమే. ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం. నిధులు మంజూరు కాగానే నూతన భవన నిర్మాణం చేపడతాం.

జ్ఞాపకాలు గుర్తు చేసుకొని.. గురువులను సన్మానించి

గరిడేపల్లి, న్యూస్‌టుడే: పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక చెరగని నాటి జ్ఞాపకాలను గుర్తు తెచ్చాయి. బాల్యంలో గడిపిన మధుర క్షణాలను అల్లర్లు, చిలిపి పనులను గుర్తుచేసుకుంటూ ఆనందోత్సవాలతో రోజంతా గడిపారు. 1993-94 బ్యాచ్ పదో తరగతి పాసైన విద్యార్థులు తాము చదువుకున్న గరిడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనే సమ్మేళనం నిర్వహించారు. ఎంఈవో ఛత్రునాయక్, నాటి గురువులను సన్మానించారు.


నాటి గురువులతో విద్యార్థులు

విద్యుత్తు సరఫరాలో అంతరాయం

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: హుజూర్‌నగర్ పట్టణంలో మిర్యాలగూడ రహదారిలో టవర్ షిఫ్టింగ్ జరుగుతున్నందున ఈనెల 21న పలు ప్రాంతాలకు విద్యుత్తు అంతరాయం ఉంటుందని డిస్కం ఏఈ రాంప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. టవర్ షిఫ్టింగ్ కారణంగా మిర్యాలగూడ రోడ్, చింతల బజార్, సీతారాం నగర్, ఏరియాలలో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.

గుట్టలపై కన్నేసి.. మట్టి తోలించి

నడిగూడెం, న్యూస్‌టుడే: రామాపురం రెవెన్యూ పరిధి సర్వే నం.190 లోని ప్రభుత్వ భూములు స్థిరాస్తి వ్యాపారులకు అడ్డాగా మారాయి. అనుమతి లేకుండా యథేచ్ఛగా ఇక్కడ భూముల నుంచి మట్టిని కోదాడ పరిసర ప్రాంతానికి తరలిస్తున్నారు. ఈ సర్వే నం.లో 1,660 ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. ఇవి కాక 600 ఎకరాల్లో గుట్టలు విస్తరించి ఉన్నాయి. పొక్లెయిన్‌తో గుట్టల మధ్య ఉన్న భూముల నుంచి మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ భూమి నుంచి మట్టి తరలించాలంటే ముందస్తు అనుమతి తీసుకోవాలి. ప్రభుత్వానికి చలానా చెల్లించాలి. ఇలాంటిదేమీ లేకుండా రాత్రికి రాత్రే మట్టిని ట్రాక్టర్లు, టిప్పర్లలో తరలిస్తున్నారు. ఈ భూములు జాతీయ రహదారికి చేరువలో ఉండటం, అధికారుల నిఘా అంతగా లేకపోవడంతో రియల్టర్ల కన్ను వీటిపై పడింది. ఇక్కడ మట్టితో రూ.లక్షల్లో వ్యాపారం చేస్తున్నారు. కోదాడ పరిసర ప్రాంతాల్లో మట్టి లభించకపోవడంతో దళారులు రంగప్రవేశం చేసి స్థిరాస్తి వ్యాపారులు, బిల్డర్లకు మట్టిని తరలిస్తున్నారు. శుక్రవారం ఈ భూముల నుంచి పొక్లెయిన్‌తో 30కి పైగా ట్రాక్టర్లతో మట్టిని కోదాడకు తరలించారు. స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు ఘటన స్థలానికి చేరుకునే లోపే సర్దుకున్నారు. మట్టి తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. ఈ మట్టి తరలింపు వ్యవహారంపై అధికారులు నిఘా ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


ట్రాక్టర్లతో మట్టి తరలిస్తున్న దృశ్యం

చట్ట పరంగా చర్యలు తీసుకుంటాం:

సరిత, తహసీల్దార్, నడిగూడెం

ప్రభుత్వ భూమి నుంచి అనుమతుల్లేకుండా మట్టి తరలిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. 190 సర్వే ప్రభుత్వ భూముల నుంచి మట్టి తరలిస్తున్నారని సమాచారం రావడంతో వెంటనే మా సిబ్బందిని అక్కడికి పంపించాం. మట్టి తరలిస్తున్న 3 ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నాం. అక్రమంగా మట్టి తరలింపునకు పాల్పడితే జరిమానాతోపాటు కేసులు నమోదు చేస్తాం.

భగవద్గీతను పరిచయం చేసి.. సారాన్ని వివరించి

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి ఆధ్వర్యంలో భగవద్గీతను పరిచయం చేసి దాని జ్ఞానాన్ని వివరించి గ్రంథాలను పంపిణీ చేశారు. ఆదివారం ప్రబోధ సమితి ఆధ్వర్యంలో జరిగిన ప్రచారంలో ప్రపంచవ్యాప్తంగా ఏ మతం లేని రోజులలో భగవద్గీత జ్ఞానం తెలియజేసినట్లు తెలిపారు. త్రైత సిద్ధాంతం- ప్రబోధ సేవాసమితి, హిందూ జ్ఞాన వేదిక హుజూర్‌నగర్, కోదాడ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, శైలజ, మహేష్, తదితరులు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.

భారీగా టేకు కలప స్వాధీనం

గరిడేపల్లి: గడ్డిపల్లిలోని సామిల్‌లో అక్రమంగా నిల్వ చేసిన టేకు కలపను సీజ్ ఆదివారం చేశారు. నల్గొండ ఫ్లయింగ్ స్క్వాడ్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి సుమారు 50 టన్నుల వరకు టేకు గుర్తించినట్లు తెలిసింది. 35 టన్నులు పట్టుకున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఇదే విషయమై సూర్యాపేట, నల్గొండ డీఎఫ్‌వోలను సంప్రదించగా తాము రాలేదని, ఫ్లయింగ్ స్క్వాడ్ వచ్చారని తెలిపారు. సీజ్ చేసిన కలపను మాయం చేసి కేసు లేకుండా చేసేందుకు మాజీ ప్రజా ప్రతినిధి తీవ్రంగా పైరవీలు చేస్తున్నట్లు తెలిసింది.

కోళ్ల పందేలు ఆడుతున్న నలుగురి అరెస్టు

నేరేడుచర్ల: నేరేడుచర్ల మండలం ఫత్తేపురం శివారులో ఆదివారం కోడి పందేలు ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.13 వేల నగదు, మూడు పందెం కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. నమ్మదగిన సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించి కోడి పందేలు ఆడుతున్న రాజేశ్‌కుమార్, రెడ్డిపల్లి రాంప్రసాద్, ఓరుగంటి నరేష్, విజయవెంకట నరసింహరాజులును అదుపులోకి తీసుకున్నారు. దేవులపల్లి నరసించారి పారిపోయినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్యనారాయణ మృతి తీరని లోటు

గరిడేపల్లి, న్యూస్‌టుడే: గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన పేరూరి సత్యనారాయణ మృతి గ్రామానికి తీరని లోటని సీపీఐ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. ప్రజలు కన్నీటి నివాళులర్పించారు. గ్రామంలో జరిగే ప్రతి అభివృద్ధి పనిలో తన భాగస్వామ్యం ఉండేలా కృషి చేశారని పలువురు పేర్కొన్నారు. గ్రామంలో మంచినీటి ట్యాంకు నిర్మాణానికి, ఆసుపత్రి కోసం స్థలం, హరిజన వాడలో పాఠశాల నిర్మాణానికి స్థలం, వైకుంఠధామంలో బోరు వేయించారని ఆయన సేవలను కొనియాడారు. గ్రామస్థులు భారీగా తరలివచ్చి నివాళులర్పించారు.



వానొస్తే బురదే..!



ఇది మేళ్లచెరువు-కోదాడ ప్రధాన రహదారి. ఎప్పుడు వానొచ్చినా, లేదా గ్రామంలోని మురుగు ఎక్కువైనా ఈ రోడ్డుపైకే నీరొస్తుంది. ఇక్కడ రోడ్డు కింద గతంలో వేసిన గూనల్లోకి నీరు ప్రవహించకపోవడం ఒక కారణమైతే, ఇదే ప్రధాన రహదారి వెంట ఇరువైపులా నిర్మించిన మురుగు కాల్వ ఇక్కడితో ఆపేయడం మరో కారణం. ఇలా నీరు వెళ్లే మార్గాల్లేక ఈ నీరంతా రోడ్డెక్కుతోంది. అడుగు లోతు మురుగునీరు చేరడంతో పాదచారులు, వాహనాలు తిరగలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇరువైపులా మురుగు కాల్వలను అలుగు వరకు పొడిగించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

- మేళ్లచెరువు, న్యూస్‌టుడే:

అవీ ఇవీ

ధర్నాలు చేయడం హాస్యాస్పదం.. మునగాల: భారాస నాయకులు రైతుల పేరుతో చేస్తున్న మోసపూరిత చర్యలను మానుకోవాలని కాంగ్రెస్ మండల నాయకుడు చంద్రయ్య అన్నారు. విలేకరులతో ఆయన ఆదివారం మాట్లాడారు. గత పది సంవత్సరాలు రైతులను, నిరుద్యోగులను, మోసం చేసి ధర్నాలు నిర్వహించడం హాస్యాస్పదమన్నారు.

సంతాపం.. నడిగూడెం: సిరిపురం లైన్‌మెన్‌గా పని చేస్తున్న రామచంద్రయ్య ఆదివారం మృతి చెందారు. ఆయన మృతికి విద్యుత్తు ఉద్యోగులు సంతాపం తెలిపారు. మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు.

భోజనం ఏర్పాటు.. నేరేడుచర్ల: నేరేడుచర్ల పట్టణంలో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్పదీక్ష చేపట్టిన స్వాములకు ఆదివారం నుంచి రెండు నెలల పాటు భోజనం అందించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మకర్త కొణతం కృష్ణారెడ్డి తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి.. కోదాడ పట్టణం: నాయకులు, కార్యకర్తలు సమష్టిగా బహుజన సమాజ్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి స్టాలిన్ అంబేడ్కర్ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం కోదాడ నియోజకవర్గ కార్యదర్శిగా అజ్మీర సక్రు నాయక్‌ను నియమించినట్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామారావు, నియోజకవర్గ అధ్యక్షుడు వీరస్వామి తెలిపారు.

జయప్రదం చేయండి.. గరిడేపల్లి: మూడు రోజుల పాటు భద్రాద్రి కొత్తగూడెంలో జరిగే ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కమిటీ సభ్యురాలు సుందరి రమాదేవి కోరారు. కీతవారిగూడెంలో మహాసభల గోడపత్రికను ఆదివారం పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. సరిత, వీరమ్మ, కళమ్మ పాల్గొన్నారు.

నిత్యావసర ధరల నియంత్రణలో ప్రభుత్వం విఫలం.. నడిగూడెం: రోజురోజుకు పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణలో పాలక ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. ఆదివారం నడిగూడెంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు. ధరల పెరుగుదలకు నిరసనగా 28న కలెక్టరేట్‌ల వద్ద నిర్వహించే ధర్నాలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నివాళి.. హుజూర్‌నగర్ గ్రామీణం: పట్టణానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు కుక్కడపు కాశయ్య సతీమణి మాజీ కౌన్సిలర్ కుక్కడపు గురవమ్మ(82) ఆదివారం మృతి చెందారు. ఆమె మృతికి వివిధ సంఘాల నాయకులు నివాళి అర్పించారు.

చేయూత.. హుజూర్‌నగర్ గ్రామీణం: పట్టణంలోని మూడో వార్డులో ఒకే కుటుంబానికి చెందిన తండ్రి, కొడుకులు కణిత నాగాచారి, లక్ష్మణాచారిల్లో ఒకరు బ్రెయిన్ స్ట్రోక్‌తో, మరొకరు పక్షవాతంతో బాధపడుతుండగా మున్సిపల్ వైస్ ఛైర్మన్ సంపత్‌రెడ్డి సమాచారం ఇవ్వడంతో ఎంజీఎఫ్ మేనేజర్ నరేష్ చేయూత ఇచ్చారు. వారికి ఎంపీఎఫ్ పింఛన్ స్కీమ్ ద్వారా నెలకు రూ.3,000 చొప్పున సంవత్సరానికి రూ.36 వేలు ఇవ్వనున్నారు. తొలి చెక్కును సంపత్‌రెడ్డి ద్వారా ఆదివారం అందజేశారు.

సినిమాలు


కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

విష్ణురామ్: దేవర, వేట్టయన్, **శ్రీనివాస:** దేవర, **కాన్‌ప్లెక్స్:** వేట్టయన్, విశ్వం, **రంగా:** వేట్టయన్, **వెంకటేశ్వర:** విశ్వం

అధ్వానంగా పట్టణ రహదారులు

పట్టణం నుంచి పల్లెలకు వెళ్లే రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ఈ చిత్రంలో గుంతలుగా కనిపిస్తున్న రహదారి కోదాడ పట్టణంలోనిది. పట్టణం నుంచి కట్టకొమ్ముగూడెం వెళ్లే రహదారి దుస్థితిని చూడవచ్చు. నిత్యం ఇక్కడి నుంచి విద్యార్థులు, పట్టణవాసులు తమ పనుల నిమిత్తం వెళుతుంటారు. రహదారి అధ్వానంగా ఉండటంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చినప్పుడు గుంతలో మురుగు నీరు చేరి పాదచారులు అక్కడి నుంచి వెళ్లలేని పరిస్థితి. ఈ రహదారి పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో ఉండటంతో వారు మరమ్మతులు చేయట్లేదని పట్టణవాసులు ఆవేదన చెందుతున్నారు. దీనిపై పంచాయతీరాజ్ ఏఈని ఫోన్‌లో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

-కోదాడ, న్యూస్‌టుడే:



సూర్యాపేట

• సూర్యాపేట • తుంగతుర్తి

రహదారిపై కూలిన భారీ వృక్షం



పెన్‌పహాడ్: మండలంలో ఆదివారం కురిసిన వర్షం, ఈదురు గాలులకు ఎస్‌.అన్నారం శివారులో భారీ వృక్షం రహదారిపై అడ్డంగా కూలిపడింది. దీంతో కొంతసేపు రాకపోకలు నిలిచిపోయాయి. మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ తూముల భుజంగ రావు చొరవతో ఎస్సై రవీందర్, పోలీసు సిబ్బంది ప్రొక్లెయిన్ సహాయంతో వృక్షాన్ని అడ్డు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

చాకలి ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకోవాలి

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. జాజిరెడ్డిగూడెంలో రజక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించి అనంతరం జరిగిన సభలో మాట్లాడారు. ముందుగా అర్వపల్లిలోని మండల పరిషత్ కార్యాలయం నుంచి జాజిరెడ్డిగూడెం వరకు ఎమ్మెల్యే కాన్వాయ్‌కి ముందు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. డీసీసీ ఉపాధ్యక్షుడు ధరూరి యోగానంద చార్యులు, డీసీసీబీ మాజీ ఛైర్మన్ బీరవోలు సోమిరెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకుడు సామ అభిషేక్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సత్యం, విగ్రహదాత గుడిపెల్లి మధుకర్‌రెడ్డి, రజక సహకార సంఘం కమిటీ అధ్యక్షుడు గిరిబాబు, కృష్ణమూర్తి, హరిప్రసాద్, శంకర్, కుమార్, విజయ్ పాల్గొన్నారు.



జాజిరెడ్డిగూడెంలో చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

బాధిత కుటుంబానికి పరామర్శ

మద్దిరాల గ్రామీణం: మండల పరిధిలోని గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన తోట లక్ష్మయ్య గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం ఆయన దశదినకర్మకు ఎమ్మెల్యే మందుల సామేల్ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతకుముందు మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, ఆయన తనయుడు సర్వోత్తమ్‌రెడ్డి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న, పచ్చిపాల వెంకన్న, సుమతి, వెంకన్న, తదితరులు, పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం: ఆర్డీఆర్

సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే: గెలుపోటములను సహజంగా తీసుకునేందుకు క్రీడల ద్వారానే సాధ్యమవుతుందని మాజీ మంత్రి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్‌లో ఉమ్మడి నల్గొండ జిల్లాస్థాయి షటిల్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, పబ్లిక్ క్లబ్ కోశాధికారి కక్కిరేణి శ్రీనివాస్, ఈసీ సభ్యులు నర్సయ్య యాదవ్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఉచిత నీటిశుద్ధి కేంద్రం ప్రారంభం..

చివ్వెంల: కాంగ్రెస్ పార్టీ పేదల పక్షం అని, వారి సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలోని దురాజ్‌పల్లి వద్ద అభివృద్ధి నిధులతో నిర్మించిన ఉచిత నీటిశుద్ధి కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సూర్యాపేట పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి, ఏఐసీసీ సభ్యులు సర్వోత్తమ్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అంజద్‌అలీ, నాయకులు చెంచల శ్రీనివాస్, మద్ది తిరుమలేష్, శ్రీనివాస్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.




దురాజ్‌పల్లిలో ఉచిత నీటిశుద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

గురువుల ప్రోత్సాహం.. ఆటలకు ఊతం

❖ క్రీడల్లో రాణిస్తున్న దురాజ్‌పల్లి మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు

చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తున్నారు సూర్యాపేట పురపాలిక పరిధి దురాజ్‌పల్లిలోని తెలంగాణ అల్పసంఖ్యాకుల గురుకుల బాలుర పాఠశాల(మైనార్టీ రెసిడెన్షియల్ బాయ్స్ స్కూల్) విద్యార్థులు. ప్రిన్సిపల్ వినోద, పీడీ సృజన్‌కుమార్, పీఈటీ రమేశ్‌ల ప్రోత్సాహంతో విద్యార్థులు ఆటల సమయాన్ని వృథా చేయకుండా సాధన చేస్తున్నారు. మక్కువతో వివిధ ఆటల్లో ప్రతిభ చూపుతున్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ (అండర్14, 17 విభాగాల్లో) పోటీలు ఎక్కడ నిర్వహించిన పాల్గొంటూ.. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో బహుమతులు సాధిస్తున్నారు. ఈ నెల 27న జరగనున్న డివిజన్ స్థాయి పోటీల్లో పాఠశాల తరఫున పాల్గొని సత్తా చాటనున్నారు.

–భానుపురి, న్యూస్‌టుడే:



క్రీడల్లో ప్రతిభ ఇలా..

- పాఠశాల నుంచి ఇప్పటి వరకు ఐదుగురు కబడ్డీ, మూడు వాలీబాల్, ఖోఖోలో ఆరుగురు రాష్ట్ర, జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.
- 2019లో వరంగల్‌లో జరిగిన రాష్ట్రస్థాయిలో పోటీల్లో కబడ్డీలో ప్రథమ, ఖోఖోలో రెండో బహుమతి సాధించారు.
- గతేడాది జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో ద్వితీయ బహుమతి రాగా వాలీబాల్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారు.
- ఇటీవల జరిగిన మండలస్థాయి కబడ్డీ, ఖోఖోలో ప్రథమ, వాలీబాల్‌లో ద్వితీయ బహుమతి సాధించారు.

సమయం వృథా చేయకుండా సాధన

– మణిచంద్ర, అండర్–17, కబడ్డీ క్రీడాకారుడు, తొమ్మిదో తరగతి



కబడ్డీ అంటే ఎంతో మక్కువ. చిన్నప్పటి నుంచి ఆటపై దృష్టిసారించాను. పాఠశాలలో క్రీడలకు కేటాయించిన సమయాన్ని వృథా చేయకుండా సాధన చేస్తున్నా. ఇటీవల జరిగిన మండల స్థాయి పోటీల్లో మొదటి బహుమతి రావడం సంతోషంగా ఉంది. రాష్ట్ర స్థాయి క్రీడాకారుడిగా ఎదగాలని ఉంది.

జాతీయ స్థాయిలో రాణిస్తా..

– కార్తీక్, అండర్–14, ఖోఖో, ఎనిమిదో తరగతి



మండలస్థాయిలో జరిగిన అండర్-14 ఖోఖో పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించాం. పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులు చెప్పే మెలకువలు పాటిస్తూ సాధన చేస్తున్నా. భవిష్యత్తులో జాతీయ క్రీడాకారుడిగా రాణిస్తా.

వాలీబాల్ శిక్షకుడిని కావాలని..

– అమన్‌రీహాన్, అండర్–14 వాలీబాల్, ఎనిమిదో తరగతి



పాఠశాలలో వాలీబాల్‌పై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. జిల్లా, డివిజన్, మండలస్థాయి పోటీల్లో తమకు ప్రాధాన్యం కల్పిస్తున్నారు. ఇటీవల జరిగిన మండలస్థాయి వాలీబాల్ పోటీల్లో మొదటి బహుమతి సాధించడంతో ఆటపై మరింత పట్టు పెరిగింది. వాలీబాల్ శిక్షకుడిని కావాలని ఉంది.

భానుపురి, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని విద్యానగర్‌లో రోడ్లపక్కన చెత్త పారబోస్తున్నారు. గాలికి చెల్లాచెదురై అపరిశుభ్రంగా మారుతోంది.
– రాజు, విద్యానగర్

✔ సిబ్బందితో వెంటనే తరలిస్తాం.
– సారగండ్ల శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సూర్యాపేట

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
సూర్యాపేట: 9154395978
తుంగతుర్తి: 80085 74450

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని కొత్తబస్టాండ్ వద్ద కుడకుడ, ఖమ్మం రోడ్డుకు వెళ్లే మార్గంలో రహదారిపై గుంతలు పడ్డాయి. వర్షానికి వాటిల్లో నీళ్లు నిలిచి కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.
– కిరణ్, సూర్యాపేట

✔ గుంతలు పూడ్చి ఇబ్బందులు లేకుండా చూస్తాం.
– యుగేందర్, ఆర్అండ్‌బీ ఏఈ, సూర్యాపేట

తిరుమలగిరి, న్యూస్‌టుడే:

? తిరుమలగిరి పుర పరిధిలోని మూడో వార్డులో ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో మురుగు నీరు నిలిచి దుర్వాసనతోపాటు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయి.
– వై.నవీన్, తిరుమలగిరి

✔ సమస్య మా దృష్టికి రాలేదు. సిబ్బందిని పంపి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. – ఎం.బిచ్చిబాబు, ఇన్‌ఛార్జి కమిషనర్, పురపాలిక తిరుమలగిరి



అర్వపల్లిలో మాట్లాడుతున్న డీసీసీ ఉపాధ్యక్షుడు యోగానంద చార్యులు, తదితరులు

'నిజమైన కార్యకర్తలను గుర్తించాలి'

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేసిన నిజమైన కార్యకర్తలను ఎమ్మెల్యే మందుల సామేల్ గుర్తించాలని డీసీసీ ఉపాధ్యక్షుడు ధరూరి యోగానంద చార్యులు కోరారు. అర్వపల్లిలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూర్యాపేటలో ఓ పార్టీలో పోటీ చేసిన వ్యక్తిని, పార్టీలు మారిన వ్యక్తులకు ప్రాధాన్యత ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తమకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు సత్యం, యువజన సంఘం నియోజకవర్గ, మండల అధ్యక్షులు రమేష్, నసీర్‌గౌడ్, పద్మ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



తిరుమలగిరి: అనంతారంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రం, రామన్నగూడెం, రామోజీతండా, నెమ్మికల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం పీఏసీఎస్ ఛైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. పీఏసీఎస్ సీఈవో పట్నం లక్ష్మారెడ్డి, డైరెక్టర్లు బెల్లంకొండ యల్లయ్య, మిర్యాల వనజ, గోపగాని మల్లయ్య, భద్రాచారి, అడిటర్ బడేసాబ్, ఏఈవో శివ పాల్గొన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో కందగట్లలో 1, 3 సెంటర్లు, గట్టికల్, ముక్కుడుదేవులపల్లి, ఇస్తాళాపురంలో కొనుగోలు కేంద్రాలను ఏపీఎం మంజుల ప్రారంభించారు. ఏఆర్ఐ స్వప్న, సీసీలు చందు నాయక్, సుధాకర్, యాదగిరి పాల్గొన్నారు.

తిరుమలగిరి: రవాణ ఖర్చులు తగ్గించుకొని మద్దతు ధర పొందేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మందుల సామేల్ సూచించారు. ఆదివారం తిరుమలగిరి పుర పరిధిలోని అనంతారంలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. పురఛైర్‌పర్సన్ అనసూయ, పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, పట్టణ అధ్యక్షుడు వీరేశ్, కౌన్సిలర్లు, జిమ్మిలాల్, జితేందర్, సరిత, శ్రీలత పాల్గొన్నారు.

నూతనకల్ గ్రామీణం: రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని డీపీఎం ఆంజనేయులు పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎర్రపహాడ్‌లో ఆదివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ముత్తయ్య, లింగాల సత్తయ్య, చలిగంటి పద్మ పాల్గొన్నారు.

తేమపై రైతుల నిరసన.. సన్న వడ్ల తేమ 14శాతం ఉండాలని తెల్పడంతో రైతులు డీపీఎంను నిలదీశారు. వేసవిలోనే 17శాతం ఉండాలంటే చాలా రోజులు ఆరబెట్టాల్సి వస్తుందని, ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు అంత తక్కువ తేమ ఉండాలంటే ఎలా సాధ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. సన్న, దొడ్డు రకం ధాన్యాన్ని వేర్వేరు కేంద్రాల్లో విక్రయించాల్సి వస్తుందని, రెండూ పండించిన రైతు ఆయా గ్రామాల్లో అమ్ముకోవాలంటే ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కలెక్టర్‌కు తెలియజేసి సమస్య లేకుండా చూస్తానమని డీపీఎం పేర్కొన్నారు. రైతులు వెంకన్న, లింగరాజు, సత్తిరెడ్డి, లింగారెడ్డి, శేరి రామలింగారెడ్డి పాల్గొన్నారు.

జాజిరెడ్డిగూడెం: జాజిరెడ్డిగూడెంలో శ్రీఉమామహేశ్వర, శ్రీయోగానంద లక్ష్మీనారసింహస్వామి రైతు ఉత్పత్తులు, మార్కెటింగ్ సహకార సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే మందుల సామేల్ ప్రారంభించారు. డీసీసీబీ మాజీ ఛైర్మన్ బీరవోలు సోమిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సామ అభిషేక్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ సురేందర్‌రెడ్డి, సంఘం అధ్యక్షులు నిరంజన్, వెంకన్న, రమేష్, సోమయ్య పాల్గొన్నారు.

నాగారం: ఫణిగిరిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సామేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు తమను క్రమబద్ధీకరించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. మేడె మారయ్య, దయాకర్, సైదులు, మల్లాచారి, రామస్వామి, బాలాజి, జగన్ పాల్గొన్నారు.



ఎర్రపహాడ్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీపీఎం ఆంజనేయులు

తుంగతుర్తి: మండల కేంద్రంలో రైతు సేవా సహకారం సంఘం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మందుల సామేల్ ప్రారంభించారు. డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు డైరెక్టర్లు రవీందర్ రెడ్డి,యాకన్న, సీఈవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రమాదాల దారి.. పట్టించుకోరేంది?

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట పట్టణంలోని 60 ఫీట్ల నూతన కలెక్టరేట్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. రహదారిపై వాహనాలు వేగంగా రాకపోకలు సాగించడంతో ప్రయాణికులు, ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వేగ నియంత్రికలు లేని కారణంగా వాహనదారులు ఇష్టారాజ్యంగా ప్రయాణిస్తున్నారు. ఇటీవల శ్రీరాంనగర్-తిరుమలనగర్ వెళ్లే చౌరస్తా వద్ద కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. మూసీ కాల్వ వరకు జన సంచారం ఎక్కువగా ఉండటంతో ఎప్పుడూ ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

● జాతీయ రహదారి నుంచి బాలాజీనగర్-తిరుమలనగర్, శ్రీరాంనగర్-ఖమ్మం జాతీయ, మూసీ కాల్వ వద్ద రహదారి ప్రమాదకరంగా మారింది. ఇక్కడ వేగ నియంత్రికలు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఉదయం, సాయంత్రం పాఠశాల, కళాశాల విద్యార్థులు రాకపోకలు సాగిస్తుండటంతో వారి తల్లిదండ్రులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుంటున్నారు. ఆర్అండ్‌బీ ఏఈ యుగేందర్‌ను వివరణ కోరగా.. పరిశీలించి వేగనియంత్రికలు ఏర్పాటు చేయించి ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు.



సూర్యాపేటలోని 60 ఫీట్ల రోడ్డులో ఇటీవల ఢీకొన్న ద్విచక్ర వాహనం, కారు

భారాస ఆందోళన పథం

తుంగతుర్తి, న్యూస్‌టుడే: ఎన్నికలకు ముందు ప్రజలకు మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా కల్పిస్తామని చెప్పి ఇవ్వకుండా మాట మార్చిందని భారాస మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య ఆరోపించారు. కేటీఆర్ పిలుపుమేరకు రైతు భరోసా ఇప్పట్లో లేదనే ప్రకటనను నిరసిస్తూ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. గాజుల యాదగిరి, నాగయ్య, యాకయ్య, శ్రీను, వెంకన్న పాల్గొన్నారు.



ఆత్మకూర్(ఎస్): నెమ్మికల్‌లో రాస్తారోకో చేస్తున్న భారాస శ్రేణులు

మద్దిరాల: మండల కేంద్రంలోని సూర్యాపేట-దంతాలపల్లి రోడ్డుపై భారాస నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మండల అధ్యక్షుడు ఎస్‌ఏ రజాక్, మాజీ వైస్ ఎంపీపీ బెజ్జంకి శ్రీరాం రెడ్డి, శ్రీను, వెంకన్న, హుస్సేన్, చంద్రమౌళి, మధుసూదన్, వెంకన్న, తిరుమలరావు, అవిలయ్య, యాకయ్య పాల్గొన్నారు.

నాగారం: నాగారం(బంగ్లా)లోని సూర్యాపేట-జనగామ జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, అంబయ్య గౌడ్, బాలమల్లు, చంద్రమౌళి, కిరణ్, అంజయ్య, అంజి, మల్లేశ్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. నాయకులు సుధాకర్‌రెడ్డి, లచ్చిరాంనాయక్, భద్రునాయక్, అనిల్, ఈదయ్య, పిచ్చయ్యగౌడ్, రాజు, సతీష్ పాల్గొన్నారు. మండలంలోని బండమీది చందుపట్లలో గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో రైతు భరోసా విడుదల చేయాలంటూ రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. కొనకంచి వీరభద్రయ్య, భాషిపంగు సునీల్, అనంతుల యల్లయ్య, అంజయ్య, వెంకన్న, కళావతి, మంగమ్మ దేవిలి తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ గ్రామీణం: మండల కేంద్రంలోని సూర్యాపేట-దంతాలపల్లి ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. మండల అధ్యక్షుడు మున్న మల్లయ్య యాదవ్, సాయిలుగౌడ్, లింగారెడ్డి, నర్సింగ్‌నాయక్, పరమేష్, లింగరాజు, సైదులు, విద్యాసాగర్, వీరు యాదవ్, నాగు నాయక్ పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: పెన్‌పహాడ్‌లో నిరసనలో చెన్ను శ్రీనివాసరెడ్డి, దరావత్ భిక్షం, లక్ష్మణ్, నాగేందర్, మురళి, నాగేశ్వరరావు, రఫీ, కృష్ణయ్య, సీతారాములు, శ్రవణ్ కుమార్, రవి, లచ్చయ్య, వినోద్, వీరబాబు, లింగయ్య పాల్గొన్నారు.


జాజిరెడ్డిగూడెం: అర్వపల్లిలో జాతీయ రహదారిపై భారాస ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు దావుల వీరప్రసాద్ యాదవ్, భారాస మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్, ప్రధాన కార్యదర్శి వల్లపు గంగయ్య, యుగేందర్, కడారి నరేష్, పెద్దులు, రాజలింగం, వెంకన్న, దశరథరామారావు, సంతు, సురేష్ పాల్గొన్నారు.



నూతనకల్: సూర్యాపేట-దంతాలపల్లి ప్రధాన రహదారిపై..

ఆత్మకూర్(ఎస్): నెమ్మికల్‌లోని సూర్యాపేట-దంతాలపల్లి రహదారిపై భారాస మండల శాఖ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. మండల అధ్యక్షుడు తూడి నర్సింహరావు, పీఏసీఎస్ ఛైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, బత్తుల ప్రసాద్, కృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి,నేరెళ్ల వెంకన్న, బెల్లంకొండ యాదగిరిగౌడ్, సుధాకర్, శేఖర్‌రెడ్డి, బ్రహ్మం, మధూకర్, ముత్తయ్య, సైదులు పాల్గొన్నారు.

తిరుమలగిరి: రాష్ట్ర ప్రభుత్వం వానకాలం పంటకు రైతుభరోసా ఇవ్వలేమని చెప్పడాన్ని నిరసిస్తూ ఆదివారం భారాస మండలశాఖ ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షులు సంకేపల్లి రఘునందన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల హామీలు నిలబెట్టుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీశ్, బర్ల మెంకన్న, యాకూబ్, కొంపెల్లి రాంమూర్తి గౌడ్, మూల వెంకట్‌రెడ్డి, మెడెపు వీరన్న, కందుకూరి ప్రవీణ్, ఎండీ.షకీల్, తదితరులు పాల్గొన్నారు.



తుంగతుర్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న భారాస నాయకులు

టీఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: టీఎమ్మార్పీఎస్ మండల కమిటీ అధ్యక్షుడిగా కొండ రవిమాదిగ నియమితులయ్యారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తి ఉపేందర్‌మాదిగ పాల్గొని మండల నూతన కమిటీని నియమించారు. ఉపాధ్యక్షుడిగా యడవెల్లి నాగేందర్‌మాదిగ, ప్రధాన కార్యదర్శిగా సూరారపు వెంకన్నమాదిగ, సహాయ కార్యదర్శిగా నవిలే రమేష్‌మాదిగ, కోశాధికారిగా తలకొప్పుల యల్లయ్యమాదిగను ఎంపిక చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాషపంగు సత్యం, పాతకొట్ల రమేష్‌మాదిగ, ముల్కలపల్లి కాటయ్యమాదిగ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన కమిటీ..

నూతనకల్: శ్రీ ధర్మశాస్త్ర అన్నదాన సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో అయ్యప్పస్వాములకు ఉచితంగా నిత్య అన్నదాన నిర్వహణ కోసం నూతనకల్ శ్రీశంబులింగేశ్వరస్వామి ఆలయం ఆవరణలో ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ చురకంటి చంద్రారెడ్డి అధ్యక్షతన ఆదివారం కమిటీని ఏర్పాటు చేశారు. ఉమ్మడి నూతనకల్ మండల అధ్యక్షుడిగా కాముని సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా చూడి మదుసూదన్‌రెడ్డి, సభ్యులుగా శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరెడ్డి, వీరారెడ్డి, సంపత్, లింగస్వామి, మల్లేష్‌లున్నారు.

నూతన కార్యవర్గం..

మహాత్మాగాంధీ రోడ్డు (సూర్యాపేట): తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీయూటీఎఫ్) జిల్లా నూతన కార్యవర్గాన్ని పట్టణంలోని సమాఖ్య కార్యాలయంలో ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా కటకం నరసింహస్వామి, అధ్యక్షుడిగా మామిడి అరవిందు, ప్రధాన కార్యదర్శిగా కస్తూరి కిషన్‌ప్రసాద్, సహాధ్యక్షులుగా పప్పు నీరజలత, తదితరులను నియమించారు. ఎన్నికల అధికారిగా టీయూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు దామెర శ్రీనివాస్, పరిశీలకులుగా ఉట్కూరి జానకిరాములు వ్యవహరించారు. చలమందరావు, రవికుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



తుంగతుర్తి, న్యూస్‌టుడే: తుంగతుర్తి ఎస్సైగా **ఆర్.క్రాంతి కుమార్** ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. పోలీసు ఉన్నతాధికారులు ఇటీవల కొంత మంది ఎస్సైలకు స్థానచలనం కల్గించారు. ఈ మేరకు తుంగతుర్తి ఎస్సై ఏడుకొండలును సూర్యాపేట వీఆర్‌కు బదిలీ చేయగా నల్గొండ మహిళా పోలీసుస్టేషన్ ఎస్సైగా ఉన్న క్రాంతి కుమార్‌ను ఇక్కడికి బదిలీ చేశారు.

కాల్వలు పూడిపోతున్నాయ్..!



సూర్యాపేట పట్టణంలోని పలు చోట్ల మురుగు కాల్వలు కూలిపోతున్నాయి. ఏళ్ల క్రితం నిర్మించిన కాల్వలు కావటంతో.. నాణ్యత పాటించకపోవటంతో పైకప్పులతోపాటు రాళ్లు కూలుతున్నా ఎవరూ పట్టించుకోవటం లేదు. సూర్యాపేటలోని మన్నాచర్చి పరిధి, బాలాజీనగర్, భగత్‌సింగ్‌నగర్, తదితర చోట్ల మురుగు కాల్వలు శిథిలావస్థకు చేరాయి. వాటికి ఏర్పాటు చేసిన కప్పులు కానీ, రాళ్లు కూలి కాల్వలో పడిపోతున్నాయి. దీంతో మురుగు పారక కాల్వలో నిల్వ ఉంటోంది. రోజుల తరబడి ఉండటంతో దుర్వాసనతో చుట్టుపక్కల నివాస గృహాల వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షానికి రోడ్లపై వరద పారి కాలనీలు నీటమునుగుతున్నాయి. దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. సిబ్బందితో వెంటనే తీయించి మరమ్మతు చేపడతామని తెలిపారు. – న్యూస్‌టుడే, సూర్యాపేట పురపాలిక

ఎగుడుదిగుడు దారులు.. తప్పని ఇబ్బందులు



సూర్యాపేట పట్టణంలో పలుచోట్ల కాలనీలకు వెళ్లే మార్గంలో రహదారులు ఎగుడుదిగుడుగా మారాయి. వాహనదారులు, ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారుల నుంచి కాలనీకి వెళ్లేందుకు రోడ్లు సమాంతరంగా లేకపోవడంతో ఇక్కట్లు పడుతున్నారు. వాహనదారులు సాఫీగా వెళ్లేందుకు ఉండాల్సిన రోడ్లు సీసీ లేచి గుంతలమయంగా మారుతున్నాయి. పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్, కృష్ణానగర్, హనుమాన్‌నగర్, తదితర చోట్ల రోడ్లు కాలనీకి వెళ్లే చోట అధ్వానంగా మారాయి. పూర్తిస్థాయిలో సీసీ నిర్మించకపోవడంతో రోడ్డు మార్గంలో వదలటంతో రహదారులు కుంగిపోతున్నాయి. దీంతో వాహనాలు రాకపోకలు సాగించడంతో మరమ్మతు గురవుతున్నాయని పలువురు వాపోతున్నారు. దీనిపై పుర కమిషనర్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. రహదారులు ఎక్కడెక్కడ ఎగుడుదిగుడుగా ఉన్నాయో పరిశీలించి మరమ్మతు చేపడతామని తెలిపారు.
– న్యూస్‌టుడే, భానుపురి

పొంచి ఉన్న ప్రమాదం

మండల పరిధిలోని పెదనెమిలలో కంఠమహేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. రెండు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన నియంత్రిక చుట్టూ రక్షణ గోడ శిథిలావస్థకు చేరింది. సమీపంలో గేదెలు, ఆవులు మేతకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడుతున్నాయి. జనావాసాల మధ్య ప్రమాదకరంగా ఉన్న నియంత్రికను సురక్షిత ప్రదేశంలో ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. 'క్షేత్రస్థాయిలో పరిశీలించి మరమ్మతులు గాని వేరే అనువైన ప్రదేశానికి గాని తరలించేలా చర్యలు తీసుకుంటామ'ని డిస్కం ఏఈ ప్రణయ్ కుమార్ తెలిపారు.



–నూతనకల్ గ్రామీణం, న్యూస్‌టుడే: